నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644


### నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

చిన్న నవ్వుతోన మిన్నగా బంధాలు
కలిసిపోవు నవియు బలముగాను
అలక కొంచెమైన యనుబంధములు చెడు
విజయలక్ష్మి వాక్కు వినురనరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు, కవి


## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 136 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 13-8-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


# ఉద్యోగులకు సెలవులు రద్దు

## తెలంగాణకు భారీ వర్ష సూచనతో అప్రమత్తం

- 72 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- కరెంట్, మంచినీటి ఇబ్బంది రాకుండా చర్యలు
- అధికారులు, కలెక్టర్లతో సిఎం రేవంత సమీక్ష






హైదరాబాద్,
తెలంగాణలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. అధికారులు, జిల్లా కలెక్టర్లు, మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మూడు రోజుల పాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సెలవులు రద్దు చేయాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. -మిగతా 2 లో



## బంగారం దిగుమతులపై సుంకాలు ఉండవు..

- దీనిపై అధ్యక్షుడు ట్రంప్ తాజాగా క్లారిటీ

న్యూఢిల్లీ,
రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా భారత్ సహా ప్రపంచంలోని పలు దేశాలపై సుంకాల మోత మోగిస్తున్నారు. రష్యా చమురు కొనుగోలు కారణంతో న్యూఢిల్లీపై ఏకంగా 50 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 25 శాతం టారిఫ్ అమల్లోకి వచ్చింది. ఆగస్టు 27 నుంచి మిగతా 25 శాతం టారిఫ్ అమలులోకి రానుంది. అయితే, ట్రంప్ నిర్ణయంతో దిగుమతి చేసుకునే బంగారు కడ్డీలపై సుంకాల పెంపు వర్తిస్తుందా? లేదా? అనే విషయంపై సందిగ్ధత నెలకొంది. దీనిపై అధ్యక్షుడు ట్రంప్ తాజాగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. 'బంగారం' లాంటి వార్త చెప్పారు. బంగారం దిగుమతులపై అదనపు సుంకాలు ఉండవని స్పష్టం చేశారు.ఒక కేజీతోపాటు 100 ఔన్సుల -మిగతా 2 లో




## బీఆర్ఎస్ కదనభేరీ సభ మరోమారు వాయిదా

- భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు ప్రకటన
- బీఆర్ఎస్ పార్టీ నేత గంగుల కమలాకర్.. తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రకటన
- వాతావరణం అనుకూలించిన తర్వాతే ఈ సభ నిర్వహణ
- త్వరలోనే మళ్లీ సభ నిర్వహణ తేదీ ప్రకటిస్తామన్న గంగుల

కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
కరీంనగర్ వేదికగా బిఆర్ఎస్ నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభను వాయిదా వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో బీఆర్ఎస్ పార్టీ కదనభేరి పేరిట నిర్వహించ తలపెట్టిన బీసీ గర్జన సభను మరోసారి వాయిదా వేసింది. భారీ వర్ష సూచన నేపథ్యంలో ఈ భారీ బహిరంగ సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కరీంనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నేత గంగుల కమలాకర్.. తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రకటన చేశారు. భారీ వర్ష సూచన కారణంగానే ఈ సభను వాయిదా -మిగతా 2 లో



## మూగజీవాలైన కుక్కలు పెద్ద సమస్య కాదు..

సుప్రీం ఆదేశాలపై రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,
ఢిల్లీ వీధుల్లో కుక్కలు కనిపించరాదని సుప్రీంకోర్టు సోమవారం ఢిల్లీ ప్రభుత్వ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. వీధి కుక్కలన్నింటినీ సాధ్యమైనంత త్వరితంగా స్టెరిలైజ్ చేసి షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు ఢిల్లీ-ఎన్‌సీఆర్ అధికారులను ఆదేశించింది. అయితే, దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలపై జంతు ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో సుప్రీం ఆదేశాలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తాజాగా స్పందించారు. మనం రోజు రోజుకూ సైన్స్, మానవత్వం లేని ప్రాచీన యుగంలోకి వెళ్లిపోతున్నట్లు ఉందని వ్యాఖ్యానించారు. 'మూగజీవాలైన కుక్కలు సమాజంలో పెద్ద సమస్య కాదు. వాటిని పూర్తిగా నిర్మూలించడం సరైన చర్య కాదు. ప్రజలకు భద్రత కల్పించాలనుకుంటే వాటికి స్టెరిలైజేషన్, టీకాలు వేయడం వంటి చర్యలు -మిగతా 2 లో

## బండి సంజయ్‌కు కేటీఆర్ లీగల్ నోటీస్ జారీ

- నిరాధార ఆరోపణలతో ప్రతిష్టకు భంగం



హైదరాబాద్,
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కల్వకుంట్ల తారక రామారావు మంగళవారం లీగల్ నోటీసులు పంపించారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని, నిరాధారమైనవని, అవి తన ప్రతిష్టను దిగజార్చే ఉద్దేశంతో చేసినవని కేటీఆర్ లీగల్ నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన బండి సంజయ్ నిర్వహించిన పత్రికా సమావేశంలో చేసిన -మిగతా 2 లో

## పాక్ ఆర్మీ చీఫ్‌కు ట్రంప్ బిగ్ గిఫ్ట్..

### బలూచ్ ఆర్మీని అంతర్జాతీయ ఉగ్రసంస్థగా గుర్తించిన అమెరికా

- అసిం మునీర్ పర్యటన వేళ అగ్రరాజ్యం అమెరికా కీలక నిర్ణయం
- తాజాగా మజీద్ బ్రిగేడ్‌ను కూడా బీఎల్ఏలో భాగంగానే భావిస్తున్నట్టు ప్రకటణ



న్యూఢిల్లీ, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
పాకిస్థాన్ ఆర్మీ ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిం మునీర్ పర్యటన వేళ అగ్రరాజ్యం అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్‌లో ప్రత్యేక దేశం కోసం పోరాడుతూ అక్కడి సైన్యానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ , దానికి చెందిన మజీద్ బ్రిగేడ్ ను విదేశీ ఉగ్రవాద సంస్థలుగా గుర్తించింది. బీఎల్ఏని 2019లోనే.. 'స్పెషల్లీ డెజిగ్నేటెడ్ గ్లోబల్ టెర్రరిస్ట్ (ఎస్‌డీజీటీ)' జాబితాలో చేర్చిన అమెరికా.. తాజాగా మజీద్ బ్రిగేడ్‌ను కూడా బీఎల్ఏలో భాగంగానే భావిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక ప్రకటన చేశారు. -మిగతా 2 లో

## గెలుపు కోసం బీఆర్ఎస్, బీజేపీల వ్యూహాలు

### రేవంత్‌రెడ్డికి సవాల్‌గా జూబ్లీహిల్స్

- బీసీ రిజర్వేషన్లతో పాటు.. స్థానిక ఎన్నికలు
- ఇక్కడ ఉనికిని చాటితేనే రేవంత్ నాయకత్వానికి సవాల్ ఉండదు



హైదరాబాద్ ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, బిసి రిజర్వేషన్లు, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్య వంటి సమస్యలు ఇప్పుడు కాంగ్రెస్‌కు సవాల్‌గా మారనున్నాయి. కబుర్లతో కాలక్షేపం చేస్తే ఇవి చుట్టుముట్టుకుంటాయి. సమయం దగ్గర పడుతోంది. వీటిని ఎలా పరిష్కరిస్తారన్నది రేవంత్ సమర్థతపైనే ఆధారపడి ఉంటుంది. దీనికితోడు పార్టీలోఐక్యత అన్నది డొల్లగా మారింది. మంత్రులు ఎవరికి వారు యమునా తీరం అన్న చందంగా ఉంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్ష నటరాజన్ -మిగతా 2 లో




## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

సృష్టి ఫర్టిలిటీ కేసు సిట్‌కు అప్పగింత

హైదరాబాద్,
సృష్టి ఫెర్టిలిటీ స్కాం కేసును ప్రభుత్వం సిట్‌కు అప్పగించింది. ఇందులో అనేక దందాలు తోడవ్వడంతో దీనిపై లోతైన విచారణ కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును సిట్‌కు అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంగళవారంఈ కేసుకు సంబంధించిన విషయాలను హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ -మిగతా 2 లో

## మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి..?

- నేను, మా అన్న ఇద్దరం సమర్థులమే..
- కోమటిరెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్
మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. నేను, మా అన్న ఇద్దరం సమర్థులమే.. ఇద్దరం గట్టిగా ఉన్నాం.. మంత్రి పదవులు ఇస్తే తప్పేంటని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిలదీశారు. నన్ను పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా మేము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రెండవసారి ప్రామిస్ చేసినప్పుడు తెలియదా మేమిద్దరం -మిగతా 2 లో




## నీళ్లు ఇవ్వకుంటే యుద్ధమే..

మళ్లీ వార్నింగ్ ఇచ్చిన బిలావల్ భుట్టో

ఇస్లామాబాద్ ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
పాకిస్థాన్ అదే పనిగా యుద్ధం వార్నింగ్ ఇస్తోంది. పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ తర్వాత ఇప్పుడు ఆ దేశ రాజకీయ నేత బిలావల్ భుట్టో( తాజాగా మళ్లీ హెచ్చరిక చేశారు. ఒకవేళ సింధూ జలాలను ఇండియా నిలిపివేస్తే, అప్పుడు -మిగతా 2 లో

# ఉద్యోగులకు సెలవులు రద్దు

(మొదటి తరువాయి)

మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలపై సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు. భారీ వర్షాలపై 72 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఇంచార్జి మంత్రులు, అధికారులకు సూచించిన సీఎం.. రానున్న మూడు రోజులు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సెలవులు రద్దు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు వరద ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణకు లా అండ్ ఆర్డర్ పోలీసుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణకు లా అండ్ ఆర్డర్ పోలీసుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అకస్మిక వరదలు సంభవించినపుడు ఎయిర్ లిఫ్టింగ్ చేసేందుకు అవసరమైన హెలికాప్టర్స్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. విద్యుత్ కు సంబంధించి అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేందుకు వీలుగా మొబైల్ ట్రాన్స్‌ఫర్స్ అందుబాటు లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ లో వరదలపై హైడ్రా అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. స్కూల్స్, కాలేజీలు, ఐటీ- సెక్టార్ ఉద్యోగులకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. భారీ వర్షాల సమయంలో బయటకు రాకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు, వరదలపై మీడియా ద్వారా సమాచారం చేరవేయాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ సిబ్బందిని అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. భారీ వర్షాలు ఉన్న జిల్లాలకు ముందే సిబ్బందిని తరలించాలని అన్నారు. ఆయా జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల ఉద్యోగుల సెలవులు రద్దు చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించేందుకు హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు- చేయాలని రేవంత్ అన్నారు. వైద్యులు అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. హైదరాబాద్‌లో వరద ప్రభావిత ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా చూడాలని స్పష్టం చేశారు. కంట్రోల్ రూమ్ ద్వారా అధికారులను అప్రమత్తం చేయాలని తెలిపారు. భారీ వర్షాలు, రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో సీనియర్ అధికారులను నియమించాలని అన్నారు.

### మూగజీవాలైన కుక్కలు
## పెద్ద సమస్య కాదు..

(మొదటి తరువాయి)

తీసుకోవాలి' అని సూచించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. వీధి కుక్కలు కనిపించకూడదు వీధి కుక్కల కాటు వల్ల రేబీస్ వ్యాధి వ్యాప్తి చెందుతోందని, ముఖ్యంగా పిల్లలు దీనికి గురవుతుండడంతో పరిస్థితి చాలా దయనీయంగా ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. వెంటనే వీధి కుక్కల కోసం షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించింది. దాదాపు 5,000 వీధి కుక్కల కోసం 6 నుంచి 8 వారాలలో షెల్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. తమ ఆదేశాలకు అవరోధాలు కల్పించడానికి వ్యక్తులు కాని, సంస్థలు కాని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. అవసరమైతే కోర్టు ధిక్కరణ ప్రక్రియ చేపడతామని కూడా ధర్మాసనం హెచ్చరించింది. వీధి కుక్కలను పట్టుకోవడానికి వచ్చే సిబ్బందిని ఎవరైనా అడ్డుకుంటే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపింది.

## మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి..?

(మొదటి తరువాయి)

అన్నదమ్ములం ఉన్నామని. ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య ఒడ్డు దాటాక బోడి మల్లయ్య అన్న చందంగా ఉందని కాంగ్రెస్ నాయకత్వంపై రాజగోపాల్ రెడ్డి నిప్పులు చెరిగారు. మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే రాజగోపాల్ రెడ్డికి అన్యాయం జరిగినట్టే. నాకు అన్యాయం జరిగితే పర్వాలేదు కానీ మునుగోడు ప్రజలకు అన్యాయం చేయొద్దని గత ప్రభుత్వానికి చెప్పినా ఇప్పుడు కూడా చెప్తున్నా.. మీరు మాటిచ్చారు ఇచ్చినప్పుడు ఇవ్వండి కానీ అప్పటివరకు మాత్రం మునుగోడు అభివృద్ధికి సహకరించి ఒక్క రూపాయి కూడా ఆపొద్దు. ఇస్తామన్నమాట ఆలస్యమైంది సమీకరణాలు కుదరటం లేదు అంటున్నారు. ఎందుకు కుదరటం లేదు సమీకరణలు? ఎవరడ్డుకుంటున్నారు నాకు మంత్రి పదవి రాకుండా అని రాజగోపాల్ రెడ్డి నిలదీశారు. 9 మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మం జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉన్నారు. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్గొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండడం తప్పా. ఇద్దరం అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమే, ఇద్దరం గట్టి వాళ్లమే. ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి. ఆలస్యమైనా సరే నేను ఓపిక పడుతున్న. ఈ ప్రాంతానికి అన్యాయం చేయొద్దు.. మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలి. భువనగిరి పార్లమెంటు నుండి ఎంపీగా పని చేశాను. నల్గొండ జిల్లాకు ఎమ్మెల్సీగా పని చేశాను. నల్గొండ జిల్లాలో ఉన్న నియోజకవర్గాలలో మునుగోడు నియోజకవర్గం వెనుకబడి ఉంది. ప్రభుత్వ దవాఖానక పోతే పేదోడికి న్యాయం జరగాలి, ప్రైవేటు ఆసుపత్రులు ప్రైవేటు పాఠశాలలు పేదవాడి రక్తం తాగుతున్నాయి. పేదవాళ్లకు అండగా ఉండాలని నేను కష్టపడుతున్న. ఆ భగవంతుడు ఏ పదవి ఇచ్చినా మునుగోడు ప్రజల కోసమే కానీ నా కోసం కాదు అని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

(మొదటి తరువాయి)

మీడియాకు వెల్లడించారు. సృష్టి కేసును సీసీఎస్ సిట్‌కి బదిలీ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో 25 మంది నిందితులను అరెస్ట్ చేశామని వెల్లడించారు. సృష్టి కేసులో 8 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని వివరించారు. ఓ కేసులో సృష్టి యాజమాన్యం బాధితులకు చనిపోయిన బిడ్డను చూపించారని చెప్పుకొచ్చారు. మరో కేసులో రూ.15 లక్షలు ఎక్కువగా ఇవ్వాలని సృష్టి యాజమాన్యం డిమాండ్ చేసిందని తెలిపారు డీసీపీ రష్మీ పెరుమాళ్. విశాఖపట్నంలో కూడా సరోగసీ పేరుతో మోసం చేశారని డీసీపీ రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు. బాధితులకు ఇచ్చిన బేబీ గర్ల్‌కి డీఎన్ఏ టెస్ట్ చేసి సరి పోల్చినప్పుడు ఈ వ్యవహారం బయట పడిందని వెల్లడించారు. ఈ కేసులో చాలామంది డాక్టర్ల ప్రమేయం ఉందని తెలిపారు. విశాఖపట్నంలోని డాక్టర్లు విద్యులత, రవిను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. వైజాగ్‌కి చెందిన డాక్టర్ విద్యులతతో పాటు- డాక్టర్ రవి, డాక్టర్ ఉషను అరెస్ట్ చేశామని వివరించారు. సికింద్రాబాద్‌లో ఉన్న హాస్పిటల్‌ను కేవలం కన్సల్టెన్సీగా మాత్రమే వాడుకున్నారని గుర్తుచేశారు. ఇక్కడ పేరుతో శాంపిల్స్ తీసుకుంటున్నారని చెప్పారు. మిగతా సరోగసీ ప్రాసెస్ అంతా వైజాగ్‌లో చేస్తున్నారని తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు 25 మందిని అరెస్ట్ చేశామని వెల్లడించారు డీసీపీ రష్మీ పెరుమాళ్. వీరిలో చాలామంది మహిళలు ఉన్నారని... మహిళా నిందితుల్లో చాలామంది అండాలు అమ్ముకున్న వారు ఉన్నారని, సరోగసీ తల్లులుగా నటించిన వాళ్లు ఉన్నారని తెలిపారు. ఎవరైనా దంపతులు సరోగసీ కోసం అప్రోచ్ అవగానే.. వాళ్లకు కొన్నిరోజుల తర్వాత ఒక ఫేక్ అల్ట్రా స్కాన్ రిపోర్ట్ పంపుతారని చెప్పుకొచ్చారు. సరోగసీ పద్ధతిలో మీకు పుట్టబోయే పాప స్కానింగ్ రిపోర్ట్ అని చెబుతారని అన్నారు. అదే సమయంలో డాక్టర్ నమ్రత ఏజెంట్లు- ఓ గర్భిణిని వెతికి పెడతారని తెలిపారు. 9 నెలల తర్వాత వైజాగ్‌లో డెలివరీ చేసి.. ఆ శిశువును సరోగసీ ద్వారా పుట్టిన పాప అని చెప్పి దంపతులకు అప్పగిస్తారని నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు.

## గెలుపు కోసం బిఆర్ఎస్, బీజేపీల వ్యూహాలు

(మొదటి తరువాయి)

పెత్తనం కూడా ఎక్కువగా కనిపిస్తోంది. సొంతంగా సమీక్షలు, పాదయాత్రలు చేస్తూ ఆమె పార్టీలో రాజకీయేతర శక్తిగా మారుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెవడంతో పాటు, బిసి రిజర్వేషన్లకు అనుగుణంగా స్థానిక ఎన్నికలు నిర్వహించడం ద్వారా పార్టీలో బలిమి చాటుకోవడం ద్వారా సిఎం రేవంత్ తన స్థానాన్ని పదిలం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ఎన్నిక కాంగ్రెస్ నేతలకన్నా సిఎం రేవంత్‌కు జీవన్మరణ సమస్యగా మారింది. ఇక్కడ ఉనికిని చాటితేనే రేవంత్ నాయకత్వానికి సవాల్ ఉండదు. ఇప్పటికే రేవంత్‌పై ముప్పేట దాడి చేస్తున్న కాంగ్రెస్ నేతలు ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓడిపోతే బంతాట ఆడు కుంటారు. అలాగే పదిమంది ఎమ్మెల్యలే వ్యవహారంలో తేడావచ్చి ఉప ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీకి మైనస్ కాగలదు. అందుకే సాధారణ ఎన్నికల కన్నా, ఉప ఎన్నికలు, స్థానిక ఎన్నికలు సవాల్‌గా మార నున్నాయి. బిసి రిజర్వేషన్లు ప్రకటించి, కేంద్రానిదే తప్పంటూ బట్టకాల్చి మీదవేసే ప్రయత్నాలు కూడా ఫలించవని తెలుసుకోవాలి. బిజెపి ఈ విషయంలో రేవంత్‌ను చెండాడేందుకు ఇప్పటికే రకరకాలుగా విమర్శలు చేస్తోంది. రిజర్వేషన్ల గండం ఎలా గట్టెక్కుతారన్నది కూడా ఇక్కడ ముఖ్యమే. చావోరేవో తేల్చుకునేందుకు రేవంత్ రెడ్డి సిద్ధం కావాల్సిన తరుణమిది. రానున్న ఎన్నికలో ఎక్కడ ఓటమిపాలైనా రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠకే భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. జూబ్లీహిల్స్‌కు సంబంధించి ఓ వైపు అభ్యర్థి ఎంపికకు కసరత్తు చేస్తూనే మరోవైపు కాంగ్రెస్‌కు తిరుగులేదన్న సంకేతాలు పంపేందుకు రేవంత్ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇకపోతే జూబ్లీహిల్స్ రాజకీయం క్షేత్రస్థాయికి చేరింది. అన్ని పార్టీలు ఉప ఎన్నికల పోరును కార్యక్షేత్రంలోనే తేల్చుకునేందుకు సమాయత్తమవుతున్నాయి. విపక్ష బిఆర్ఎస్ కూడా ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఇప్పుడు ఎన్నిక అనివార్యమయ్యింది. అందువల్ల బిఆర్ఎస్ ఈ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పోరాడబోతున్నది. కాంగ్రెస్ వైఫల్యాలనే ఎక్కువగా ప్రచారానికి ఉపయోగించుకోనుంది. ఇక్కడ గెలవడం ద్వారా ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా కార్యాచరణ సిద్దం చేసుకుంటోంది. ఇక్కడ విజయం సాధించి తెలంగాణలో ఇక బిజెపి, కాంగ్రెస్‌లకు స్థానం లేదని నిరూపించాలన్న పట్టుదలతో బిఆర్ఎస్ ఉంది. మరోవైపు ఈ ఉపఎన్నికకు అన్ని రాజకీయ పార్టీలు సమాయత్త మవుతున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు వ్యూహరచన లో తలమునకలై ఉన్నాయి. ఎలాగైనా సరే సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో బిఆర్ఎస్, ఈ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని భాజపా భావిస్తోంది. మరోవైపు అధికార కాంగ్రెస్ పట్టు సాధించేందుకు పావులు కదుపుతోంది. బిఆర్ఎస్, కాంగ్రెస్ తమ అభ్యర్థులు ఎవరన్నది బహుశా ఎన్నికల ప్రకటన వచ్చే వరకు నానబెట్టడం

## నీళ్లు ఇవ్వకుంటే యుద్ధమే..



(మొదటి తరువాయి)

యుద్ధం చేయడం తప్ప పాకిస్థాన్‌కు మరో అవకాశం లేదని భుట్టో పేర్కొన్నారు. ఇండియా ఇప్పటికే తమకు తీవ్రమైన నష్టం చేసిందని, పాకిస్థానీలందరూ ప్రధాని మోదీకి వ్యతిరేకంగా పోరాటం చేయాలని మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో పిలుపునిచ్చారు. సింధ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వ చర్యలు పాకిస్థాన్‌కు నష్టాన్ని మిగిల్చాయని, ప్రజలందరూ ఐక్యంగా ప్రధాని మోదీకి వ్యతిరేకంగా పోరాటం చేయాలని అన్నారు. పాకిస్థానీ ప్రజలను రెచ్చగొట్టిన భుట్టో.. ఆరు నదులను తీసుకువచ్చేందుకు పాకిస్థానీలు శక్తివంతంగా ఉన్నట్లు చెప్పారు. ఒకవేళ ఇండియా ఇదే వైఖరితో కొనసాగితే, అప్పుడు తమకు దారులు లేవని, జాతి ప్రయోజనాలను కాపాడుకునేందుకు యుద్ధమే శరణ్యం అవుతుందని భుట్టో అన్నారు. మేం ఏమీ యుద్ధం ప్రారంభించడం లేదని, కానీ ఒకవేళ సింధూర్ లాంటి దాడి చేయాలనుకుంటే, పాకిస్థాన్‌లోని ప్రతి ప్రావిన్సుకు చెందిన ప్రజలు పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆ యుద్ధంలో ఇండియా ఓడిపోతుందని, తామేమీ వెనక్కి తగ్గబోమని భుట్టో తెలిపారు.

### బంగారం దిగుమతులపై
## సుంకాలు ఉండవు..

(మొదటి తరువాయి)

(2.8 కిలోల) బంగారు కడ్డీలు సుంకాల పరిధిలోకి వస్తాయని అమెరికా కస్టమ్స్ అధికార వర్గాలు ఇటీవలే పేర్కొన్న విషయం తెలిసిందే. ఈమేరకు జులై 31న ఓ ప్రకటన విడుదల చేశారు. అదే సమయంలో గోల్డ్ బార్‌లపై సుంకాల విధింపుపై ట్రంప్ క్లారిటీ ఇస్తూ త్వరలోనే ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను జారీ చేస్తారని వైట్‌హౌస్ అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో ఈ విషయంలో గందరగోళం నెలకొంది. ఇదే సమయంలో పసిడి ధరలు కూడా అమాంతం పెరిగాయి. దీంతో ట్రంప్ తాజాగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు బంగారంపై సుంకాలు విధించబోమంటూ ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు. 'బంగారంపై సుంకాలు ఉండవు' అని రాసుకొచ్చారు.

## బీఆర్ఎస్ కదనభేరీ సభ మరోమారు వాయిదా

(మొదటి తరువాయి)

వేసినట్లు- ఆయన తెలిపారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని.. అందులో భాగంగా ఆగస్టు 14, 15, 16, 17 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే సూచించిందని వివరించారు. ఈ క్రమంలో ఈ కదన భేరి సభను వాయిదా వేసినట్లు- తెలిపారు. అయితే వాతావరణం అనుకూలించిన తర్వాత ఈ సభను నిర్వహించాలని పార్టీ అగ్రనాయకత్వం భావిస్తుందని పేర్కొన్నారు. సభను మళ్లీ ఎప్పుడు నిర్వహించనున్నది మరికొద్ది రోజుల్లో నిర్ణయించి.. ప్రకటిస్తామని గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు గమనించాలని సూచించారు. తొలుత ఆగస్ట్ 8వ తేదీన కరీంనగర్ వేదికగా ఈ కదన భేరీ సభ నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంనిర్ణయించింది. కానీ ఎందుకో.. ఈ సభను ఆగస్ట్ 14వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రకటించింది. కానీ భారీ వర్షాల నేపథ్యంలో ఈ సభను మరోసారి వాయిదా వేశారు. ఈ సభ ఏర్పాటుపై వాయిదాల పర్వం కొనసాగడానికి వెనుక ఉన్న కారణాలు ఏమై ఉంటాయనే ఒక చర్చ అయితే రాజకీయ వర్గాల్లో బలంగా సాగుతోంది. అయితే వర్షాల కారణంగానే బీసీ కదన భేరి సభను వాయిదా వేస్తున్నట్లు- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రకటించారు. ప్రస్తుతం సభ నిర్వహణకు అన్నీ ఏర్పాట్లు- జరుగుతున్నాయని, అయితే.. వాతావారణ శాఖ చెప్పిన అంశాలను పరిగనణలోకి తీసుకొని వాయిదా వేస్తున్నట్లుగా పేర్కొన్నారు. భేరి ఎప్పుడు నిర్వహించే విషయాన్ని.. తదుపరి ప్రకటిస్తామని, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు ఈ విషయాన్ని గమనించాలని ఆ ప్రకటనలో కోరారు.

## పాక్ ఆర్మీ చీఫ్‌కు ట్రంప్ బిగ్ గిఫ్ట్..

(మొదటి తరువాయి)

ఇటీవలే కాలంలో బీఎల్ఏకు చెందిన మజీద్ బ్రిగేడ్ పాక్‌లోని పలు ప్రాంతాల్లో వరుస దాడులకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. పాక్ సైన్యమే లక్ష్యంగా ఆత్మాహుతి దాడులు నిర్వహిస్తోంది. 2024లో కరాచీ ఎయిర్‌పోర్ట్, గ్వాదర్ పోర్ట్ అథారిటీపై బీఎల్ఏ దాడులు చేపట్టింది. ఇక ఈ ఏడాది అంటే 2025లో జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్ చేసి దాదాపు 300 మంది ప్యాసింజర్లను బందీలుగా చేసుకుంది. పాక్ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి వారిని విడిపించింది. ఈ రైలు హైజాక్ ఘటనలో 31 మంది పౌరులు, పాక్ సైనికులు చనిపోయారు. ఇలా వరుస దాడులతో బలూచ్ ఆర్మీని ఉగ్రసంస్థగా గుర్తించాలని పాక్ కోరుతూ వస్తోంది. అయితే, ప్రస్తుతం అధిక టారిఫ్‌ల నేపథ్యంలో భారత్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. ఇదే సమయంలో పాక్‌తో అగ్రరాజ్యం బంధం బలపడుతోంది. ఇప్పటికే దాయాదితో వ్యాపారం చేసేందుకు అమెరికా ఒప్పందం కూడా చేసుకుంది. ఇదే సమయంలో పాక్ ఆర్మీ చీఫ్ అసిం మునీర్ సైతం రెండు నెలల్లో రెండోసారి యూఎస్ పర్యటనకు వెళ్లారు. ఆయన పర్యటన కొనసాగుతున్న వేళ అమెరికా నుంచి ఈ ప్రకటన వెలువడటం గమనార్హం.

## బండి సంజయ్‌కు కేటీఆర్ లీగల్ నోటీస్ జారీ

(మొదటి తరువాయి)



ఆరోపణలపై కేటీఆర్ ఈ నోటీసులను పంపించారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, దురుద్దేశ పూరితమైనవని కేటీఆర్ తరపు న్యాయవాదులు నోటీసులో తెలిపారు. బండి సంజయ్ తన హోదాను దుర్వినియోగం చేస్తూ, ప్రజల్లో తన ప్రతిష్టను దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కేవలం రాజకీయంగా వార్తల్లో నిలిచేందుకు అడ్డగోలుగా ప్రాపగండ చేస్తున్న బండి సంజయ్ పదేపదే ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. బండి సంజయ్ ఆరోపణలతో తన ప్రతిష్టకు భంగం కలిగిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు-తో పాటు- ఆ తర్వాత మంత్రిగా తాను అనేక రంగాల్లో అద్భుతమైన సేవలు అందించానని చెప్పుకొచ్చారు. అయితే బండి సంజయ్ పదేపదే చేస్తున్న వ్యాఖ్యలతో తన క్లయింట్ కేటీఆర్ పరువుకి భంగం కలుగుతుందని నోటీసులో న్యాయవాదులు పేర్కొన్నారు. మీడియా సమావేశంలో బండి సంజయ్ చేసిన ఏ వ్యాఖ్యలకు కూడా ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని, ఒక పార్లమెంటు- సభ్యుడుగా, కేంద్ర మంత్రిగా బాధ్యత కలిగిన పదవుల్లో ఉండి మరొక శాసనసభ్యుడుపైన అసత్య పూరిత అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని లీగల్ నోటీ-సులో కేటీ-ఆర్ న్యాయవాదులు ప్రస్తావించారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారం లేదని, ఇవి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే చేశారని నోటీ-సులో వెల్లడించారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ కేటీఆర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. కేటీఆర్ అతని కుటుంబ సభ్యులపై భవిష్యత్తులో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయకుండా ఉండాలని నోటీ-సులో కోరారు. నోటీసులు అందిన ఏడు రోజుల్లోగా ఈ డిమాండ్లను పాటించని పక్షంలో, చట్టపరంగా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆరోపణలతో కలిగిన నష్టానికి బండి సంజయ్ బాధ్యత వహించాల్సి ఉంటుందని నోటీసులో కేటీఆర్ న్యాయవాదులు పేర్కొన్నారు.

## 2025 ఆగస్టు 13, బుధవారం




మాసం - పక్షం
శ్రావణ మాసం (అమాంత)
కృష్ణపక్షం
తిథి
చతుర్థి - మ. 10:42 వరకు
పంచమి - ఆ తరువాత ప్రారంభం
నక్షత్రం
రేవతి - ఉద. 7:29 వరకు
అశ్విని - ఆ తరువాత ప్రారంభం
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: 4:31 - 5:17
అభిజిత్ ముహూర్తం: 12:00 - 12:52
అమృతకాలం: సా. 3:55 - 5:39
అశుభ సమయాలు
రాహుకాలం: ఉ. 12:29 - 2:05
యమగండం: సా. 5:18 - 6:54
దుర్ముహూర్తం: ఉ. 10:53 - 11:45 & మ. 3:30 - 4:22
వర్జ్యం: సా. 3:55- 5:39

## ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయండి: -ఎమ్మెల్యే కవ్వంపల్లి



**మానకొండూర్, ఆగస్టు12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా పథకం అమలు, నిర్మాణాల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి. ఆలస్యం చేస్తున్న వారి ఇళ్లను రద్దు చేసి ఇతరులకు మంజూరు చేయాలి. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాలి” అని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు వీవీ వరలక్ష్మి (మానకొండూర్), జి.కృష్ణప్రసాద్ (శంకరపట్నం), వి.సురేందర్ (తిమ్మాపూర్), డి.శ్రీనివాస్ (గన్నేరువరం), కె.ప్రవీణ్ (బెజ్జంకి), వై.శశికళ (ఇల్లంతకుంట)తో పాటు ఆయా మండలాల హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**మానకొండూర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జాతీయ పతాకాన్ని ప్రతి ఇంటిపై ఎగరవేయాలన్న ప్రధాని మోదీ పిలుపు మేరకు మానకొండూరు మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని బీజేపీ మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వేద పాఠశాల నుండి పల్లె మీద చౌరస్తా వరకు జాతీయ గీతాల నినాదాలతో ర్యాలీ సాగింది. ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీటీసీలు గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కర చారి పాల్గొన్నారు. ప్రజల్లో దేశభక్తి చైతన్యం కలిగించేలా తిరంగా ర్యాలీ నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అప్పాని తిరుపతి, మియాపురం లక్ష్మణ చారి, రంగు సంపత్, గౌడ్ భాష, బోయిన ప్రదీప్ యాదవ్, కత్తి ప్రభాకర్ గౌడ్, శీలం కుమార్ యాదవ్, మార్కొండ రమేష్, పటేల్ ఆరేళ్ల శ్రీహరి, మీసా రమణయ్య, వెంకటరాజం, ఆరేపల్లి సునంద్ తదితరులు పాల్గొన్నారు.

## మద్దికుంటలో యూరియా కోసం రైతుల క్యూ



**మానకొండూర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మద్దికుంట గ్రామంలో యూరియా కోసం రైతులు పొద్దునుంచి క్యూ లైన్లలో నిలబడుతున్నారు. వర్షాకాలంలో సాగు పనులు జోరుగా సాగుతున్న నేపథ్యంలో ఎరువుల కొరత రైతులను ఇబ్బందుల్లోకి నెట్టింది. సరఫరా పెంచాలని రైతులు కోరుతున్నారు.

## దళితుల భూసమస్యకు వారం రోజుల్లో పరిష్కారం



**తిమ్మాపూర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూగుండ్ల -గోపాలపూర్ గ్రామాల్లో దళితుల 8 ఎకరాల భూమిపై కొనసాగుతున్న వివాదాన్ని వారం రోజుల్లో పరిష్కరించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతి, రెవెన్యూ అధికారులు, సర్వే విభాగంతో కలిసి భూమిని పరిశీలించారు. 178 సర్వే నంబరులో రికార్డుల్లో ఉన్న భూమి మోఖాపై లేకపోవడంతో దళితులు ఆందోళన చెందుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. సత్వర భూ సర్వే చేపట్టి హద్దులు తేల్చాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మోడీ దిష్టిబొమ్మ దహనం



**ఆమనగల్లు, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఇండియా కూటమి నేతల అరెస్టుపై నిరసనగా యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇండియా కూటమి ‘సంసద్ టూ ఈసీ’ ర్యాలీలో రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రియాంక గాంధీ తదితరుల అరెస్టుపై మండిపడుతూ, కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, “రాహుల్ గాంధీ అరెస్టులకు భయపడే వ్యక్తి కాదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు రాష్ట్ర బీజేపీ మద్దతు తెలిపినా, కేంద్రం మొండిచెయ్యి చూపింది” అని విమర్శించారు. “చంద్రబాబు, నితీశ్ కుమార్ అండతో మోడీ ప్రధాని అయ్యారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని అవ్వడం ఖాయం” అని శ్రీకాంత్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మండల అధ్యక్షులు జగన్, పట్టణ అధ్యక్షులు వస్పుల మానయ్య, మాజీ ఎంపీపీ ధనంజయ్య, మాజీ సర్పంచ్ పర్వతాలు, ఆదివాసీ నాయకులు కృష్ణ నాయక్, పెరుమండ్ల వెంకట్ రెడ్డి, యువ నాయకులు అవినాష్ రెడ్డి, గాజుల సురేష్, అలీమ్, కృష్ణ, రాజేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షల విధానంపై ట్రస్మా హర్షం

**హైదరాబాద్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** 2025 -26 విద్యా సంవత్సరం నుండి పదో తరగతి పరీక్షలు 80:20 విధానంలో (బాహ్య-అంతర్గత మూల్యాంకనం) కొనసాగించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని ట్రస్మా (తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం) హర్షంగా స్వాగతించింది. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాధుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి ఎన్. రమేశ్ రావు, కోశాధికారి పి. రాఘవేంద్ర రెడ్డి, జాతీయ అడ్వైసర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ“ఈ విధానం విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించడమే కాక, వారి క్రియేటివిటీ, నిరంతర కృషికి ప్రోత్సాహం కలిగిస్తుంది” అని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల పద్ధతిలో మార్పు కోసం ట్రస్మా గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యాశాఖ అధికారులకు పలు దఫాలుగా వినతిపత్రాలు సమర్పించిన విషయం తెలిసిందే.“ఈ విధానం సమగ్ర మూల్యాంకన లక్ష్యాలను నెరవేర్చుతుంది. విద్యార్థులకు సమానమైన అవకాశాలు కల్పిస్తుంది. నాణ్యమైన విద్యను ప్రోత్సహిస్తుంది” అని ట్రస్మా అభిప్రాయపడింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు.

## జేడీ లక్ష్మీనారాయణకు ఆవోపా సన్మానం



**కరీంనగర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సిబిఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణను రాష్ట్ర ఆవోపా అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ సన్మానించారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, విలువల బడి సేవా కార్యక్రమాలపై మార్గదర్శనం అందించేందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. విద్యా రంగంలో ఆయన సేవలు దార్శనికంగా నిలుస్తున్నాయని మలిపెద్ది శంకర్ ప్రశంసించారు.

## కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి



**యాచారం, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాధ్యమవుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు జరుపుల విజయ్ నాయక్ తెలిపారు. మల్కిజగూడ గ్రామంలో బూత్ అధ్యక్షులు ఆధ్వర్యంలో ఇంటింటి మహా సంపర్క్ అభియాన్ నిర్వహించారు. సీసీ రోడ్లు, మురుగు కాలువలు, హైమస్ట్ లైట్లు, వీధిదీపాలు వంటి మౌలిక సదుపాయాలన్నీ కేంద్ర నిధులతోనే అందాయని ఆయన పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి తోడ్పడాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు పగడాల శ్రీశైలం, మాజీ సర్పంచ్ రాయకంటి విజయ్ కుమార్, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా శ్రేయస్సే నా లక్ష్యం: శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తన నివాసంలో నియోజకవర్గ ప్రజలతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల వినతిపత్రాలు స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, పెండింగ్ పనులు, కొత్త పనుల మంజూరుకు మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆర్ఎంపి, పీఎంపీ డాక్టర్ల సమస్యలపై జిల్లా మెడికల్ అధికారులతో చర్చించి పరిష్కారం కోరినట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## హెచ్ఎంటీ పార్కు గోడ కూలిన ఘటనపై స్పందించిన కార్పొరేటర్



**హైదర్‌నగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హెచ్ఎంటీ పార్కు -జలవాయు విహార్ కాలనీ సరిహద్దు గోడ భారీవర్షాలకు మరోసారి కూలిపోయిన నేపథ్యంలో, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ప్రాంతాన్ని పరిశీలించిన హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు. వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. డివిజన్‌లో నిత్యం సమస్యలతో బాధపడుతున్న ప్రాంతాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. మౌలిక వసతుల కల్పనతో కాలనీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. నాణ్యతపై రాజీపడకుండా పనులు వేగంగా పూర్తి చేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ రాజీవ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# జీవితం ఒక యజ్ఞం - సేవే ధర్మం

## జాతీయ యువజన అవార్డు గ్రహీత గుడ్లనరం శివకుమార్ జీవిత ప్రయాణం గురించి విశేషాలు








హైదరాబాద్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్): కల్వకుర్తి అనే చిన్న పట్టణంలో పుట్టి, జీవితంలో ఎన్నో పరీక్షలు ఎదుర్కొంటూ, తన కష్టనష్టాలను ప్రజాసేవా దీక్షగా మార్చుకున్న యువకుడు ు గుడ్లనరం శివకుమార్. 26 ఏళ్ల వయసులోనే వెయ్యికి పైగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేసి, వేలాదిమందికి అండగా నిలిచి, దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు.

**చిన్ననాటి కష్టాలే బలమయ్యాయి**

1999 మే 11న నాగమణి – నారాయణ దంపతులకు జన్మించిన శివకుమార్ చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. అక్క మొగిలి పార్వతి, బావ దుర్గాప్రసాద్ సంరక్షణలో పెరిగిన అతను, అన్నయ్య వెంకటేశ్వర్లుని కూడా కోల్పోయిన బాధను భరించాడు. కానీ ఈ కష్టాలు అతని మనసును దృఢం చేశాయి.

**విద్యా ప్రయాణం**

కృష్ణవేణి టాలెంట్ స్కూల్, జీనియస్ హై స్కూల్‌లో చదువుకున్నాడు. వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ, సిద్దిపేటలో డిప్లొమా చేసి, కల్వకుర్తి విఆర్ఎం కాలేజీలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాడు. ప్రస్తుతం హైదరాబాద్ సికింద్రాబాద్‌లో మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ చేస్తున్నారు.

**స్ఫూర్తినిచ్చిన స్వామి వివేకానంద**

ఐదో తరగతిలో ఉన్నప్పుడు స్వామి వివేకానంద జీవచరిత్ర విని ప్రేరణ పొందిన శివకుమార్, 2012లో గాంధీనగర్‌లో స్వామి వివేకానంద సేవా బృందం స్థాపించాడు. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలకు ఆకర్షితుడై, చిన్నచిన్న సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో మార్పు తేవాలన్న లక్ష్యంతో ముందుకు సాగాడు.

**సేవా కార్యక్రమాల విస్తృతి**

- పేదలకు భోజనం అందించడం
- హాస్పిటల్స్‌లో రోగులకు పండ్లు, పచ్చి కూరలు పంపిణీ
- స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు
- హరితవనం ప్రాజెక్టులు
- విద్యార్థులకు సహాయం

ఇప్పటివరకు వెయ్యికి పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన శివకుమార్, భవిష్యత్తులో 4,000 కార్యక్రమాలు చేపట్టాలనే సంకల్పంతో ఉన్నాడు.

**జాతీయ యువజన అవార్డు**

రెండు నెలల క్రితం, కేంద్ర క్రీడల మంత్రి చేతుల మీదుగా జాతీయ యువజన అవార్డు, లక్ష రూపాయల నగదు బహుమతిని అందుకున్నాడు. ఈ గౌరవాన్ని తన జీవితంలోని లి“ పూర్వజన్మ సుకృతం”లిగా భావిస్తున్నాడు.

తన బావ దుర్గాప్రసాద్ లివర్ సమస్యతో బాధపడుతుంటే, తన లివర్‌ను దానం చేసి ప్రాణాన్ని కాపాడాడు. ఈ సంఘటన అతని సేవా దీక్షకు ప్రతీక.

**లక్ష్యం – ప్రతి మనిషికి తోడుగా ఉండటం**

“మనిషి ఏ ఆస్తిపాస్తులు తీసుకురాడు. కానీ త్యాగమూర్తులను ఆదర్శంగా తీసుకుని, పదిమందికి ఉపయోగపడేలా బ్రతకాలి” ు ఇదే అతని జీవిత మంత్రం. భవిష్యత్తులో రాష్ట్రపతి ఆహ్వానం వచ్చినా, లేదా ప్రధాని పదవి ఇచ్చినా, ప్రజల మేలు కోసం త్యాగం చేస్తానని శివకుమార్ అంటున్నారు.

## కరీంనగర్‌లో సీనియర్ సిటిజన్స్ ఆత్మీయ సమ్మేళనం



**కరీంనగర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** భాగ్ స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో జ్యోతినగర్‌లోని ఎమ్ కన్వెన్షన్ హాల్‌లో “సీనియర్ సిటిజన్స్ ఆత్మీయ కుటుంబ సమ్మేళనం” కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మారం సురేష్ మహారాజ్ స్వామి, ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ నిరంజన్ చారి, ప్రముఖ పిల్లల వైద్యుడు డాక్టర్ సురేందర్ బాబు, స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర బద్యులు హరీష్ బాబు, రాష్ట్ర కార్యవాహ లక్ష్మీ నారాయణ, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కార్యవాహ దక్షిణ మూర్తి తదితరులు ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్స్, సంఘ నాయకులు, జూపల్లి ధీరజ్ సహా పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## “స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్”లో అన్ని పాఠశాలలు పాల్గొనాలి



**కరీంనగర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్”లో జిల్లాలోని అన్ని పాఠశాలలు తప్పనిసరిగా పాల్గొనాలని, “బుధవారం బోధన” కార్యక్రమాన్ని నేటి నుండి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మండల విద్యాధికారులతో సమావేశం నిర్వహించిన ఆమె, పాఠశాలల్లో టాయిలెట్లు, తాగునీటి సౌకర్యాలు, హ్యాండ్ వాష్ విధానం, విద్యార్థుల జీవన నైపుణ్య శిక్షణ వంటి అంశాలను “స్వచ్ఛ హరిత విద్యాలయ” యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రతి బుధవారం ఒక సబ్జెక్టు, పుస్తకం, ఇంగ్లీష్ క్లబ్ కార్యకలాపాల ద్వారా విద్యార్థుల ఆంగ్ల పరిజ్ఞానాన్ని పెంపొందించాలన్నారు. “ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇంగ్లీష్, తెలుగుతో పాటు అన్ని సబ్జెక్టుల్లో రాణించాలి” అని సూచించారు. ఈ సమావేశంలో యూనిసెఫ్ జిల్లా సమన్వయకర్త కిషన్ స్వామి, స్వచ్ఛభారత్ సమన్వయకర్త వేణు ప్రసాద్, విద్యాశాఖ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మండల విద్యాధికారులు, ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అహల్యాబాయి హెూల్కర్ 230వ వర్ధంతి

### రాష్ట్రవ్యాప్తంగా జరుపుకుందాం



**కరీంనగర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మధ్య భారత మహారాణి అహల్యాబాయి హెూల్కర్ 230వ వర్ధంతిని ఆగస్టు 13న రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పూలే బీసీ సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కదారి అయిలన్న కురుమ పిలుపునిచ్చారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదురుగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ“1725లో జన్మించిన అహల్యాబాయి హెూల్కర్ 30 ఏళ్ల పాటు ప్రజాపాలన నిర్వహించి, 108 శివలింగాలు, 157 ఆలయాలు నిర్మించి, దానధర్మాలతో ప్రజల ఆదరణ పొందారు. ఆమె జీవిత చరిత్రను నేటి తరానికి తెలియజేయాలి. పాఠ్య పుస్తకాల్లో చేర్చాలి” అని సూచించారు. ఆమె పేరుతో ఇండోర్ విమానాశ్రయం, జాతీయ రహదారులు, విశ్వవిద్యాలయాలు ఉన్నాయని గుర్తుచేశారు. “ఆమె సేవలు భారతీయ మహిళా శక్తికి ప్రతిరూపం” అని పేర్కొన్నారు.

# వికారాబాద్ కలెక్టరేట్‌లో ఏసీబీ కలకలం



**వికారాబాద్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ సోదాలు కలకలం రేపాయి. రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి సుజాత 15,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నవాబుపేట తహసీల్దార్ కార్యాలయానికి ప్రొసీడింగ్ కాపీ పంపించేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సంబంధిత రెవెన్యూ సెక్షన్‌లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి, ఇతర ఉద్యోగులను ప్రశ్నిస్తున్నారు.

# బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు




**ఎలిగేడు, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** హైదరాబాద్‌లో హిందూ ఆలయాల కూల్చివేతకు నిరసనగా హిందూ సంఘాలు పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్ నేపథ్యంలో మంగళవారం బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఎలిగేడు మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు గాదె రంజిత్ రెడ్డి, సీనియర్ నాయకులు అడ్డగుంట తిరుపతి, రాయపాక మనోహర్, అమరగుండ గంగయ్య, భోగ కిరణ్‌లను ఏఎస్‌ఐ రామచంద్రం అరెస్టు చేశారు. బంద్ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

# పీఆర్సీ అమలుపై తపస్ డిమాండ్




**అబ్దుల్లాపూర్ మెట్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీయూఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ్ మాట్లాడుతూ, "పెండింగ్‌లో ఉన్న డీఏలు, బిల్లులు వెంటనే చెల్లించాలి. పీఆర్సీని తక్షణమే ప్రకటించి అమలు చేయాలి" అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు, 2003 డీఎస్సీ ఎంపికైన వారికి పాత పెన్షన్ పథకం అమలు, 2008 డీఎస్సీ వారికి జీతాల చెల్లింపు, సీపీఎస్ రద్దు వంటి అంశాలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేష్ కుమార్, జిల్లా కార్యదర్శి శంకర్, మండల ఉపాధ్యక్షులు శ్రీహరి, కార్యవర్గ సభ్యులు నాగలక్ష్మి, నరహరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆదివాసి దినోత్సవం






**అచ్చంపేట, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని అచ్చంపేటలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. క్యాంప్ ఆఫీస్ అంబేద్కర్ ప్రజాభవన్ వద్ద ఆదివాసుల జెండా ఆవిష్కరించి, చెంచు గిరిజనులు డప్పుల చప్పుళ్ల మధ్య ఆటపాటలతో ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అంబేద్కర్‌కు పూలమాల వేసి, ఆయనతో కలిసి అంగిరేకుల ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ"ఆదివాసి మహిళలతో కలిసి ఆటపాటల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. కాంచన చరిత్ర, సంప్రదాయాలకు ఆదివాసులు ప్రతిరూపం. ప్రకృతి మాత బిడ్డలైన గిరిపుత్రులకు శుభాకాంక్షలు" అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ విద్యార్థులకు డైటు, కాస్మెటిక్ చార్జీలు పెంచినట్లు, ఎస్టీ రైతులకు సోలార్ పవర్ అందిస్తున్నట్లు, రెబల్ శాఖకు 15 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బదవత్ సంతోష్, డీఎఫ్వో రోహిత్, ఆర్డీవో మాధవి, అంతటి మల్లేష్, కాశన్న యాదవ్, ఆదివాసి సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సైన్స్ వింగ్ కళాశాల నూతన భవనాన్ని వినియోగంలోకి తేవాలి



**కరీంనగర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కారా నగడ్డలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల (సైన్స్ వింగ్) నూతన భవనాన్ని త్వరితగతిన వినియోగంలోకి తేవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కళాశాల సందర్శించిన ఆమె, ప్రాంగణంలో ఉన్న స్క్రాప్ తొలగించాలని, శిథిల భవనాలను పూర్తిగా తొలగించాలని సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన 15 లక్షల నిధులను టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మరమ్మతులకు వినియోగించాలని తెలిపారు. నాలుగేళ్లుగా నిలిచిపోయిన ఆరు తరగతుల నూతన భవనాన్ని తరగతుల నిర్వహణకు సిద్ధం చేయాలని, అవసరమైన డోర్లు, కిటికీలు, బ్లాక్ బోర్డ్స్, ఫర్నిచర్, బెంచీలు వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ వెంకటరమణచారి ఉన్నారు.

## బిజెపి నేతల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా తీరంగా యాత్ర కార్యక్రమం

**మచిలీపట్నం ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ యొక్క పిలుపు మేరకు గన్నవరం బీజేపీ సీనియర్ నాయకులు రాజా వాసిరెడ్డి మనోజ్ కుమార్ అద్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమం నిన్న ఉదయం నిడమానూరు రైల్వే స్టేషన్ నుండి విజయవాడ -విశాఖపట్నం జాతీయ రహదారి వరకు తిరంగా యాత్ర జరిగింది.
ఈ కార్యక్రమంలో సుగుణ, సురేష్ , దుర్గాప్రసాద్, వేణు ,బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


# పర్యావరణ పరిరక్షణ సమితి యొక్క లక్ష్యాలు మరియు మిషన్

**లక్ష్యం**

సుస్థిరమైన, ఆరోగ్యకరమైన జీవనవాతావరణం కోసంపర్యావరణాన్ని రక్షిస్తూ, ప్రజల ఆరోగ్యం, ఆయుష్షు పెంపుకు కృషి చేయడం.

పర్యావరణ పరిరక్షణ సమితి
చెట్టు = అమ్మ
Reg No. 643/2025
Nurture Nature, Promote Wellness

**మిషన్**

- శాస్త్రీయ పద్ధతుల్లో పర్యావరణ పరిరక్షణ
- గాలి, నీరు, నేలపై కాలుష్య నివారణ
- విద్య, సాంకేతికతతో ప్రజల్లో అవగాహన
- యువతకు పది వేల ఉద్యోగ అవకాశాలు
- అభివృద్ధి -పర్యావరణాన్ని సమతుల్యంగా ముందుకు నడిపించడం
- మాదకద్రవ్యాల రహిత భారత దేశ ఆవిష్కరణ
- భారతీయ సాంప్రదాయాల విస్తృత ప్రచారం


# భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఆవిర్భవించినది ఎఐఎస్ఎఫ్

**-బిఎఐఎస్ఎఫ్ ,నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్.**

**నాగర్ కర్నూల్, ఆగస్టు 12, (నీలగిరి ఎక్స్ ప్రెస్).** భారత దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా దేశ స్వాతంత్ర్యం మా జన్మహక్కు అని 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ లోని లక్నోలో ఆవిర్భవించిందని,ప్రభుత్వ విద్య పరిరక్షణకై, నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఎఐఎస్ఎఫ్ నాగర్కర్నూల్ జిల్లా కార్యదర్శి ప్రేమ్ కుమార్ పిలుపునిచ్చారు.మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. దానిలో భాగంగా నాగర్ కర్నూల్ సిపిఐ లక్ష్మణ సారీ భవనం ఎదుట ఏఐఎస్ఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అధ్యక్ష వహించిన నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు నరేష్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి బలుముల ప్రేమ్ కుమార్ అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని




బ్రిటిష్ సామ్రాజ్యవాదుల చెర నుంచి మాతృభూమి విముక్తికై 1936 ఆగస్టు 12న ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావించి దేశ స్వాతంత్రోద్యమంలో అసమాన పోరాటాలు నిర్వహించి, ఎంతో మంది విద్యార్థులను త్యాగం చేసిందని కొనియాడారు. పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన ఈ విద్యార్థి సంఘం స్వాతంత్ర్య అనంతరం ప్రభుత్వ విద్యా పరిరక్షణకై, శాస్త్రీయ విద్య, కామన్ విద్యావిధానం అమలుపై నిరంతరం పోరాటాలు సాగిస్తూ 89 సంవత్సరాలుగా విద్యార్థుల శ్రేయస్సు కోసం అశేష త్యాగాలు చేస్తూ ఆవిర్భావం నాటి నుంచి నేటివరకు గల్లి నుండి డిల్లీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలే ఊపిరిగా - పోరాటాలే ప్రాణంగా విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా విద్యారంగ సమస్యలపై చదువు-పోరాడు అంటూ దేశ వ్యాపితంగా ఉద్యమాలు నిర్వహిస్తున్న సంఘం ఎఐఎస్ఎఫ్ అని, విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు అని పోరాటం చేసిందని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో, మలిదశ తెలంగాణ ఉద్యమంలో వీరోచిత పోరాటం చేసిన సంఘం ఎఐఎస్ఎఫ్ అని అన్నారు. ఎంతో మంది రాజకీయ వేత్తలను, మేధావులను అందించిన చరిత్ర ఎఐఎస్ఎఫ్ కు ఉన్నదని అన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని వీరోచిత పోరాటం, 18 సంవత్సరములకు ఓటుహక్కు ఉద్యమం, మలిదశ తెలంగాణ పోరాటంలో, హాస్టళ్ల సమస్యలపై, విద్య వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న పాలకులపై అలుపెరుగని సమరశీల పోరాటాలు చేసి దేశంలో ఎన్నో విజయాలు సాధించిందని, 90 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఎఐఎస్ఎఫ్ ఉద్యమ స్ఫూర్తితో నేటి పాలకులు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై, ప్రభుత్వ విద్య పరిరక్షణకై, అసమానతలతో కూడిన నూతన జాతీయ విద్యా విధానంకు వ్యతిరేకంగా, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలల్లో పాల్గొన్న నాయకులు ఏఐవైఎఫ్ నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు దేశమని ఆంజనేయులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు మల్లేష్, అభిషేక్, తరుణ్, మల్లికార్జున్, అరుణ్, మధు, ప్రకాష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్.

- **విద్యార్థులకు అండ ఏఐఎస్ఎఫ్ జెండా.**
- **ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు సూరిగి వినయ్ కుమార్.**

**దేవరకొండ, ఆగస్టు 12. (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను డిండి లో ఘనంగా నిర్వహించారు ,ఈ యొక్కకార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు సూరిగి వినయ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై శ్వేత-అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ భారతదేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘమని,స్వాతంత్రం రాకపూర్వమే 1936 ఆగస్టు 12న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని, లక్నో నగరంలోని బెనారస్ యూనివర్సిటీలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య పురుడోసుకున్నదాని,కాశ్మీరు నుండి



కన్యాకుమారి వరకు దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం ఏదైనా ఉన్నదంటే అది ఒక్క ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘమే అని, నాటి నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ పాఠశాలలలో కళాశాలలలో మౌలిక సదుపాయాల కల్పించాలని, పెండింగ్ లో ఉన్నటువంటి స్కాలర్షిప్ ,ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని, మెస్ ,కాస్మోటిక్ చార్జీలను ధరలకు అనుగుణంగా పెంచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, విద్యాశాఖ మంత్రిని వెంటనే కేటాయించాలని, గురుకుల విద్యార్థులకు సొంత భవనాలను కేటాయించాలని అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్న ఏకైక సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఆయన అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఇచ్చే పిలుపులకు విద్యార్థి లోకం ఏఐఎస్ఎఫ్ ఇచ్చే పిలుపులను విజయవంతం చేయాలని, విద్యార్థులకు అండ, ఏఐఎస్ఎఫ్ జెండా ఎల్లప్పుడూ ఉంటదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఏనమల్ల నవీన్ , ఏఐఎస్ఎఫ్ నాయకులు భాను, సిద్ధూ, చరణ్,బన్నీ,పూజ, నిరోజ, స్ఫూర్తి,ప్రణవి, నిహారిక,శిరీష,శ్రావణి, సందీప్, శివ, పండు,అఫ్రోజ్,సురేష్, జస్వంత్,అఖిల, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ తగ్గిద్దాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



**కరీంనగర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
లయన్ కొల్లూరి జితేందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో "ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం" నినాదంతో శాతవాహన యూనివర్సిటీ చౌక్‌లో ఉచిత బ్యాగుల పంపిణీ చేశారు. వీధి వ్యాపారులు, బాటసారులకు సుమారు 80 బ్యాగులు పంపిణీ చేసిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, సభ్యులు జాడి బాల్ రెడ్డి, ఈ.రెడ్డి తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగారకీ సంకటహార చతుర్థి సందర్భంగా ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు



**నాల్కల్, ఆగస్టు 12:**
జహీరాబాద్ నియోజకవర్గం నాల్కల్ మండలంలోని రేజింతల్ సిద్ధి వినాయక దేవస్థానంలో అంగారకీ సంకటహార చతుర్థి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ అంజి రెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ ఆహ్వానం మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో నేలకల్ మండల అధ్యక్షుడు మల్లేష్, జహీరాబాద్ నాయకులు గొల్ల భాస్కర్ యాదవ్, రమేష్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోడీ కానుకగా విద్యార్థులకు ఉచిత సైకిళ్లు



**ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా 20,000 సైకిళ్లు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 71 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, ఎంఈవో కృష్ణ హరి, హెచ్‌ఎం మనోహర్, జిల్లా నేతలు పొన్నాల తిరుపతిరెడ్డి, మద్దుల బుగ్గారెడ్డి, బంధారపు లక్ష్మారెడ్డి, దాసరి గణేష్, దాసరి పూర్ణిమ, వంగ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ"విద్య, వైద్యం రంగాల్లో పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా మోదీ గిఫ్ట్‌గా ఈ సైకిళ్ల పంపిణీ జరుగుతోంది. త్వరలోనే ఫస్ట్ క్లాస్ నుంచి 6వ తరగతి వరకు విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, నోట్‌బుక్స్, వాటర్ బాటిల్, కంపాస్ బాక్స్ పంపిణీ చేస్తాం" అని తెలిపారు.

## వర్షాల కారణంగా బీసీ కథనభేరి వాయిదా

**కరీంనగర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**



వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ పూర్వ జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన "బీసీ కథనభేరి" కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఆగస్టు 14న నిర్వహించాల్సిన ఈ కార్యక్రమాన్ని, వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు 14-17 తేదీల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున వాయిదా వేస్తున్నట్లు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. వాతావరణం అనుకూలించిన తర్వాత కొత్త తేదీని నిర్ణయించి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, కార్యకర్తలు, అభిమానులు గమనించాలని ఆయన కోరారు.

### కాశిపల్లిలో అభివృద్ధి
## పనులకు శంకుస్థాపన



**గోదావరిఖని, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గత 25 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన కాశిపల్లి ఎస్సీ కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్. 23వ డివిజన్‌లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ అరుణ శ్రీ, స్థానిక కౌన్సిలర్లు, నాయకులతో కలిసి 50 లక్షల నిధులతో సీసీ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. "ఎన్నికల ముందు గడప గడప తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నాం. ప్రజా ప్రభుత్వంలో వాటిని పరిష్కరిస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం" అని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## బొమ్మకల్ బైపాస్‌లో ట్రాఫిక్ సమస్యలపై వినతిపత్రం



**కరీంనగర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బొమ్మకల్ బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ స్టాపర్లు ఏర్పాటు చేయాలని, వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానజీ వాకడే, ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామికి వినతిపత్రం అందజేశారు. వినతిపై స్పందించిన ట్రాఫిక్ ఏసీపీ తక్షణమే అధికారులను పంపించి స్థల పరిశీలన చేపట్టారు. "వాహనాల నిలుపుదలపై శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు మెంబర్ పాశం తిరుపతి, ఆసరి తిరుపతి, గాలిపెల్లి నారాయణ, మేకల వెంకటేష్, పుట్టపాక శ్రీధర్, పెద్ది లక్ష్మణ్, మేర్గవేన శ్రీకాంత్, కాల్వ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన వ్యక్తికి సహాయం చేసిన ఎమ్మెల్సీ



**జహీరాబాద్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పస్నాపూర్ చౌరస్తా ఫ్లైఓవర్‌పై ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ సి. అంజి రెడ్డి తన వాహనాన్ని ఆపి, అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి ట్రాఫిక్ క్లియర్ చేయించి బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ఆయన చూపిన మానవత్వం స్థానికులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, నాయకుడు గొల్ల భాస్కర్ పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన డా. వి. నరేందర్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. వి. నరేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. "తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకురావడమే కాకుండా, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారు" అని ఆయన ప్రశంసించారు.

## శిశుమందిర్ విద్యార్థులకు క్షేత్ర స్థాయి పోటీలకు అర్హత



**కరీంనగర్, ఆగస్టు12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
భైంసాలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో శిశుమందిర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి క్షేత్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. యోగా అండర్ 17: సాత్విక, వనజ, స్మైలి శ్రీ, త్రిపురసుందరి యోగా అండర్ 14: వేదక్షరి, శివాని, హర్షిత, హర్షిణి, రిశ్విత చెస్ అండర్ 14: శ్రీవల్లి, అభిగ్న, అమృత, హనిశ్రీ విజేతలను పలువురు ప్రముఖులు అభినందించారు. ప్రిన్సిపాల్ రాజమౌళి మాట్లాడుతూ "క్రీడలు భవిష్యత్తు కెరీర్‌కు పునాది" అని పేర్కొన్నారు.

## యూరియా కోసం రైతుల పడిగాపులు



**హుస్నాబాద్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎరువుల కొరతతో రైతులు ఉదయం 3 గంటల నుంచే లైన్లలో నిలబడుతున్నారు. చెప్పులను క్యూలో పెట్టి పక్కకు కూర్చునే దృశ్యాలు మండలంలోని పలు గ్రామాల్లో కనిపిస్తున్నాయి. ప్రభుత్వం రైతుల అవసరాలను పట్టించుకోకపోవడం బాధాకరమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "వెంటనే స్పందించి యూరియా సరఫరా చేయాలి, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాం" అని హెచ్చరించారు.

## చెంజర్లలో ఉచిత నేత్ర వైద్య శిబిరం





**మానకొండూర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మానేరు లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో చెంజర్ల గ్రామ పంచాయతీ ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రేకుర్తి ఐ హాస్పిటల్ వైస్ చైర్మన్ లయన్ చిదుర సురేష్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 35 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ముత్యం శంకర్ గౌడ్, సెక్రటరీ జిల్లా కృష్ణ, చింత సురేష్, పడమటింటి రమేష్, గడ్డి గణేష్, గొల్లెన కొమురయ్య, బుర్ర చంద్రాకర్ గౌడ్, పెట్టాం సంపత్, డాక్టర్ రమేష్, కరోబార్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి ఉద్యమాల సారథి ఎఐఎస్ఎఫ్




**కరీంనగర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
విద్యారంగ సమస్యలపై దేశవ్యాప్తంగా సమరశీల పోరాటాలు చేసిన ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్ మాత్రమేనని మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యడ సృజన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గీతభవన్ చౌరస్తాలో జెండా ఆవిష్కరించారు. 1936లో లక్నోలో ప్రారంభమైన ఈ సంఘం స్వాతంత్ర్య ఉద్యమం నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన వరకు కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ప్రభుత్వ విద్యపై నిర్లక్ష్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల జాప్యం, ఫీజుల నియంత్రణ చట్టం అమలు లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "విద్యా రంగ పరిరక్షణ కోసం మిలిటెంట్ పోరాటాలకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, మచ్చ రమేష్, హేమంత్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పైడిపెల్లి రాజు, యుగంధర్, సందీప్, శ్రావణి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

# లధక్‌లో రెడ్ క్రాస్ సేవా జెండా




**హనుమకొండ, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
హనుమకొండకు చెందిన యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్ ఇ.వి. సాత్విక లధక్‌లోని ఖర్దుంగ్లా (ఎత్తు: 17,582 అడుగులు) వద్ద రెడ్ క్రాస్ జెండాను ఆవిష్కరించి సేవా స్ఫూర్తిని చాటా "పదవ తరగతి నుంచే రెడ్ క్రాస్ సేవలపై ఆసక్తి పెరిగింది. నాన్న చేస్తున్న సామాజిక సేవలే నాకు ప్రేరణ. జాతీయ స్థాయిలో శిక్షణ పొంది, అనేక రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. సమాజ సేవే నా జీవన లక్ష్యం" అని సాత్విక తెలిపారు.

# ఇసుక మాఫియా దోపిడిపై ఆర్డీవోకు బీఎస్పీ వినతిపత్రం



**హుస్నాబాద్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, హుస్నాబాద్ పట్టణంలో ట్రాక్టర్ ట్రిప్పుకు 6,000-8,000 వరకు వసూలు చేస్తున్న ఇసుక మాఫియా దోపిడిపై బీఎస్పీ నాయకులు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఇసుక స్టాక్ పాయింట్ల సమాచారం లేక, టోకెన్ల వ్యవస్థలో అయోమయం నెలకొనడంతో పేద, మధ్యతరగతి ప్రజలు అధిక ధరలకు ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తోంది. మంత్రి పొన్నం ప్రభాకర్ పరిధిలో జరుగుతున్న ఈ దోపిడీపై ఆయన దృష్టికి తీసుకెళ్లకపోవడం దారుణమని బీఎస్పీ నేతలు విమర్శించారు. పొట్లపల్లి గ్రామంలోని ఇసుకను 2,000 లోపు ధరకు హుస్నాబాద్ మండల గ్రామాలకు, పట్టణానికి అందించేలా చర్యలు తీసుకోవాలని బీఎస్పీ పార్టీ తరఫున కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, మారెపల్లి సుధాకర్, ఎలగందుల శంకర్, వెలుపుల రాజు, వకీల్ రవి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో ప్రభుత్వ కార్యాలయాల సమీకరణపై వినతిపత్రం



**కొత్తపల్లి, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కొత్తపల్లి మండలంలోని తహసీల్దార్, మండల పరిషత్, వ్యవసాయ, విద్యాధికారి కార్యాలయాలు వేర్వేరు ప్రాంతాల్లో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అన్ని కార్యాలయాలను ఒకే చోట ఏర్పాటు చేయాలని బీజేపీ మండల శాఖ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసింది. కరీంనగర్ పట్టణానికి సమీపంలో ఉన్న కొత్తపల్లి మండల ప్రజలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం 20 కిలోమీటర్ల దూరంలోని గంగాధరకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, కొత్తపల్లి మండలాన్ని కరీంనగర్ సబ్ రిజిస్ట్రార్ పరిధిలోకి చేర్చాలని కూడా కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వ కార్యాలయాల సమీకరణకు చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు బీజేపీ కార్యాచరణ రూపొందించిందని మండల అధ్యక్షుడు కుంట తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జవ్వాజి రమేష్, కడార్ల రతన్ కుమార్, కోమటిరెడ్డి అంజన్ కుమార్, వేముల అనిల్ కుమార్, బోనాల నరేష్, కడారి శ్రీనివాస్, బైరెడ్డి వంశీ, గుడిసెల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ అరెస్టు అక్రమం

## -బీజేపీకి భయమని కాంగ్రెస్ విమర్శ



**కల్వకుర్తి, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. "రాహుల్ గాంధీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే బీజేపీ ప్రభుత్వం అరెస్టులకు పాల్పడుతోంది. ఇది ప్రజాస్వామ్యంపై దాడి. ఎన్నికల సంఘం కూడా బీజేపీకి వంతపాడుతోంది" అని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా బీఎస్పీ, ఇతర ప్రతిపక్షాలు కూడా రాహుల్ అరెస్టును ఖండిస్తూ ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

# ఉచితాల మత్తు పని తత్వాన్ని మింగేస్తోంది





**మహేశ్వరం, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఉచిత పథకాల వల్ల ప్రజల్లో పని తత్వం తగ్గిపోతున్నదని, యువత అలసత్వంలో మునిగిపోతున్నదని పద్మారావు కాపు ఆందోళన వ్యక్తం చేశారు. "రేషన్, వైద్యం, పింఛన్, ఉచిత బస్సు ప్రయాణం, పెట్టుబడి సాయం వంటి పథకాలతో ప్రజలు కష్టపడే తత్వాన్ని కోల్పోతున్నారు. ఇతర రాష్ట్రాల వారు తెలంగాణలో పొలాలు కొనుగోలు చేస్తుంటే, మనవాళ్లు తమ పొలాలు అమ్ముకుంటున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో, సుప్రీం కోర్టు కూడా ఉచిత పథకాలపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "ఉచితంగా రేషన్, డబ్బులు అందుతున్నందున ప్రజలు పని చేయడానికి ఇష్టపడడం లేదు. ఉచితాల వల్ల పరాన్నజీవులుగా మారుతున్నారు" అని ధర్మాసనం పేర్కొంది. పద్మారావు కాపు సూచించినట్లుగా, "మన యువత మేలుకోవాలి. మన పనిని మనమే చేసుకోవాలి. లేకపోతే రాబోయే రోజుల్లో మనం కూలీలుగా మిగిలిపోతాం" అని హెచ్చరించారు.

# అంగరంగ వైభవంగా అంకాలమ్మ జాతర



**చిత్రియాల, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని చిత్రియాల గ్రామంలో మంగళవారం శ్రీశ్రీశ్రీ అంకాలమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్, పీసీసీ సభ్యుడు జాలే నరసింహారెడ్డి గ్రామ ప్రజలతో కలిసి అమ్మవారిని దర్శించుకుని వేద మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. "అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలి" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, చిత్రియాల, బుడ్డోని తండా, పెద్దమూల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# కందుకూరులో ఘనంగా తిరంగా ర్యాలీ





**కందుకూరు, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ అంగరంగ వైభవంగా నిర్వహించారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బూర దిలీప్, రాష్ట్ర స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ ఊటు మహేందర్ నేతృత్వంలో విద్యార్థులు జాతీయ పతకాలను పట్టుకుని "జై జవాన్" నినాదాలతో దేశభక్తిని చాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ హాజరై, "ప్రతి ఇంటి నుంచి ఒక సైనికుడు తయారవ్వాలి" అని పిలుపునిచ్చారు. "ఆపరేషన్ సింధూర్ విజయంతో భారత సైనికుల శౌర్యం ప్రపంచానికి తెలిసింది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజి రెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి మంద పాండు, ఎంపీటీసీ బక్క మల్లేష్, లెక్చరర్లు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాశిరెడ్డిగూడలో సీసీ కెమెరాల ప్రారంభం







**ఫరక్‌నగర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా ఫరక్‌నగర్ మండలంలోని కాశిరెడ్డిగూడ గ్రామంలో గ్రామ ప్రజలు, యువకుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయ్ కుమార్, ఎస్ఐ రాజేష్ ప్రారంభించారు. "నేర నిరోధన, పరిశోధనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి గ్రామంలో వీటి ఏర్పాటు అవసరం" అని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కెమెరాల ఏర్పాటు దాత కిరణ్ కుమార్‌ను పోలీస్ అధికారులు అభినందించారు. గ్రామ పెద్దలు, యువకులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# హుస్నాపురం కాలనీవాసుల వినతికి కలెక్టర్ సానుకూల స్పందన



**కరీంనగర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మానేరు డ్యాం కట్టకింద 30 ఏళ్లుగా నివసిస్తున్న బతుకమ్మ, హుస్నాపురం కాలనీల పేద కుటుంబాలకు ఇరిగేషన్ శాఖ జారీ చేసిన నోటీసులపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మాజీ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ-వేణు కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ ప్రాపర్టీ కొనుగోలు చేసినవారు, ప్రభుత్వ పట్టాలతో ఇళ్లు నిర్మించినవారు ఉన్నాఅందరూ పేదవాళ్లే కావడంతో ఎలాంటి అన్యాయం జరగకుండా న్యాయం చేయాలని వారు కోరారు. కలెక్టర్ పమేలా సత్పతి సానుకూలంగా స్పందించి, ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన



**యాచారం ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇబ్రహింపట్నం నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని, ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. యాచారం మండలం నక్కర్త మేడిపల్లి గ్రామంలో సిసి రోడ్ లు మరియు ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ పలు అభివృద్ధి పథకాలకు ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం , అభివృద్ధి కోసం చిత్తశుద్ధిదతో పనిచేస్తున్నామని, నియోజకవర్గాన్ని అని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దతానని అన్నారు. సీసీ రోడ్లతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు , కాంగ్రెస్ నాయకులు అమృత సాగర్,అంగోత్. వెంకటేష్ , మంఖల దాస్ , శేఖర్ రెడ్డి, మరియు యాచారం ఎంపీడీవో , మేడిపల్లి పంచాయతీ కార్యదర్శి కిషన్ నాయక్,మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు ముచ్చర్ల సంపత్ మాజీ ఎంపిటిసి మోటే శ్రీశైలం, మాజీ సర్పంచ్ బాలరాజు గౌడ్ , దింది మధుకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మాజీ సర్పంచ్ లు , మాజీ ఎంపీటీసీలు...జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## “హర్ ఘర్ తిరంగా”కు ప్రజల మద్దతు



**కొత్తపల్లి, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని “హర్ ఘర్ తిరంగా” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ కొత్తపల్లి మండల అధ్యక్షుడు కుంట తిరుపతి పిలుపునిచ్చారు. మంగళవారం ఖాజీపూర్ చౌరస్తా నుంచి బావుపేట అంగడి బజార్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. “ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగరవేయాలి. వీరుల త్యాగాలను గుర్తిస్తూ, దేశ సమైక్యత కోసం ప్రతిజ్ఞ చేయాలి” అని ఆయన సూచించారు. ఆపరేషన్ సింధూర్ విజయాన్ని ప్రస్తావిస్తూ, “భారత సైనికుల ధైర్యం ప్రపంచాన్ని నివ్వరపరిచింది. దేశ ఖ్యాతి విశ్వవ్యాప్తంగా మార్మోగుతోంది” అని అన్నారు. ఈ సందర్భంగా మండల సమస్యలపై మాట్లాడిన ఆయన, కొత్తపల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఒకే చోట ఏర్పాటు చేయాలని ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కడార్ల రతన్, కోమటిరెడ్డి అంజన్ కుమార్, వేముల అనిల్, గుడిసెల రంజిత్, బోనాల నరేష్, బైరెడ్డి వంశీ, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## సైనిక వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థి వేదాన్ష్



**బాలాపూర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బం ప్రకాష్ డీఏవీ పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి వేదాన్ష్ భారత సైనికుని వేషధారణలో పాల్గొని అందరి ప్రశంసలు పొందాడు. దేశభక్తి భావనను ప్రతిబింబించేలా వేదాన్ష్ ప్రదర్శన ఆకట్టుకుంది. “జై జవాన్” నినాదాలతో వేదికపై అతని ఆత్మవిశ్వాసం, వేషధారణ విద్యార్థుల్లో దేశసేవ పట్ల ఆసక్తిని పెంచింది.

## ప్రతీ గడపగడపకు సంక్షేమ ఫలాలు

-మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.
-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.





**దేవరకొండ, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
చందంపేటమండలంలోని రేకులగడ్డ రోడ్డు నుండి నల్లచెలముల గ్రామం వరకు 1.60 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం నాడు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ,కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, కొత్తగా రేషన్ కార్డులు,రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ,రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సదుపాయానికి రూ.10 లక్షల పెంపు వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రజల ముంగిటకు తీసుకు వచ్చినట్టు చెప్పారు. చందంపేట మండలంలోని చిత్రియాల గ్రామంలో శ్రీ శ్రీ అంకాలమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంకాలమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ దేవరకొండ ప్రాంత ప్రజలపై ఉండి,ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు,మండల ముఖ్య నాయకులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్ యుఐ నాయకులు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం తీర్పును స్వాగతించిన మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గట్టు వామన్ రావు దంపతుల హత్య కేసును సీబీఐకి అప్పగించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్వాగతించారు. “ఇది న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించే నిర్ణయం. అసలు దోషులకు, అప్పటి ప్రభుత్వ పెద్దలకు శిక్ష పడితేనే బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుంది” అని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. “బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పట్లో విచారణను తప్పుదోవ పట్టించి అసలు హంతకులను కాపాడింది. వృద్ధ తల్లిదండ్రుల ఆవేదనను పట్టించుకోలేదు. ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థే చివరకు గెలుస్తుంది” అని మంత్రి వ్యాఖ్యానించారు.

## “హిందూ గుడులు కూల్చి కాలేజీకి కాపాడుతున్న కాంగ్రెస్”

ప్రభుత్వం పై విమర్శలు చేసిన సరూర్నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి





**సరూర్నగర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం సరూర్నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ‘ఓవైసీ బ్రదర్స్ చెరువును కబ్జా చేసి నిర్మించిన కాలేజీని కూల్చకుండా, హిందువుల ఇళ్లు, గుడులను మాత్రం కూలగొడుతున్నారు. ఇది ఖాన్ లక్కీ గ్రీసు పూసిన కాంగ్రెస్ పని” అని ఆరోపించారు. భట్టి విక్రమార్క స్ఫూర్తితో సరూర్నగర్ చెరువులో పేద విద్యార్థుల కోసం స్కూల్ నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు. “పేదల విద్యకు అండగా నిలవడం మా లక్ష్యం” అని పేర్కొన్నారు.

## పాఠశాల చుట్టూ చెత్త..

విద్యార్థులకు ఆరోగ్య భయం







**అచ్చంపేట, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మున్సిపల్ పరిధిలోని వల్లపట్ల కాలనీ 13వ వార్డులో ఉన్న మండల పరిషత్ పాఠశాల పరిసరాలు అస్వచ్ఛంగా మారాయి. పాఠశాల చుట్టూ కంప చెట్లు, చెత్త, మోరి కాల్వలు, డ్రైనేజీలు పేరుకుపోవడంతో దోమలు పెరిగాయి. మురుగు వాసనతో విద్యార్థులు జ్వరాలు, అంటురోగాలకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే వంశీకృష్ణ తక్షణ చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డుల పంపిణీ

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**యాచారం,ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు.
యాచారం మండల కేంద్రంలో ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. దేశంలో సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అర్హులైన పేదవారికి ఆహార భద్రత కల్పించి, ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కలాం స్టార్టప్ యూత్ అవార్డు కార్యక్రమంలో ముజీబ్



**ఢిల్లీ, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన “డాక్టర్ కలాం స్టార్టప్ యూత్ అవార్డు” కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముజీబ్ మాట్లాడుతూ“ఈ అవార్డు మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వారసత్వాన్ని గౌరవించేందుకు, యువ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రూపొందించబడింది. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో యువత పాత్ర కీలకం” అని తెలిపారు. దేశవ్యాప్తంగా పోటీపడిన యువతలో 27 మంది మైనార్టీ యువతకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బషీరుద్దీన్, కార్యదర్శి బల్బీర్ సింగ్ లు పాల్గొన్నారు. అనంతరం వారు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## లేడీ అఘోరీకి కోర్టు బెయిల్



**కరీంనగర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన లేడీ అఘోరీ అలియాస్ శ్రీనివాస్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. 10,000 జరిమానాతో పాటు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసిన కోర్టు, ప్రతి గురువారం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని ఆదేశించింది. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పీఎస్‌లో మే 5న యువతి ఫిర్యాదు మేరకు అత్యాచారయత్నం కేసు నమోదైంది. అనంతరం శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ప్రస్తుతం ఆయన మంగళవారం జైలు నుంచి విడుదల కానున్నారు. ఇక మరో కేసులోఒక ప్రొడ్యూసర్‌ను బెదిరించి డబ్బులు తీసుకున్న ఆరోపణలపై కూడా విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో కూడా బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

## మోర్ సూపర్ మార్కెట్‌లో గడువు ముగిసిన వస్తువులు

- ఫుడ్ సేఫ్టీ శాఖ తనిఖీ

కరీంనగర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):
కరీంనగర్ కామన్ చౌరస్తాలోని మోర్ సూపర్ మార్కెట్‌లో గడువు ముగిసిన ఫుడ్ ఐటమ్స్ విక్రయిస్తున్నారన్న సమాచారం సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అంకిత్ రెడ్డి సోమవారం సాయంత్రం 4.30 గంటలకు మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో యిప్పీ నూడుల్స్, చిక్కీ ప్యాకెట్లు, ధనియాలు వంటి గడువు ముగిసిన వస్తువులు గుర్తించి డిస్పోస్ చేశారు. ఇంకా 2–7 రోజుల్లో గడువు ముగియనున్న పలు వస్తువులను గుర్తించి, వాటిని అమ్మకుండా రిటర్న్ చేయాలని సూచించారు. మార్కెట్



యాజమాన్యానికి నోటీసు జారీ చేసి, ఒక రోజు వ్యవధిలో అన్ని గడువు ముగిసిన వస్తువులను తొలగించాలని ఆదేశించారు.

# బీసీ రిజర్వేషన్లపై బీజేపీ వైఖరిని ఖండించాలి: పాలడుగు నాగార్జున




**నల్లగొండ, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బీజేపీపై ప్రజలు చైతన్యం సాధించి ఢిల్లీ గద్దె దించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు. దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ“బీజేపీ పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయకుండా, బీసీల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడుతోంది. తెలంగాణ అసెంబ్లీలో చేసిన తీర్మానంపై గవర్నర్ వెంటనే సంతకం చేయాలి” అని డిమాండ్ చేశారు. ‘తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు నోరు మెదపకపోవడం, బండి సంజయ్ ‘42 శాతం రిజర్వేషన్లు అమలు చేయలేము’ అని చెప్పడం సిగ్గుచేటు. ఆయన బీసీలకు క్షమాపణ చెప్పాలి” అని అన్నారు. ఈ సమావేశానికి కొండా వెంకన్న అధ్యక్షత వహించగా, నలపరాజు సైదులు, కొండ అనురాధ, పోలే సత్యనారాయణ, బుల్లు రవీందర్, మల్లెబోయిన రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కార్మిక నాయకుడి జన్మదిన వేడుకలు



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు కలమడుగు రాజేందర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఇడపాక వీరస్వామి, ప్రధాన కార్యదర్శి అల్వాల రమేష్ మిత్రబృందం ఆధ్వర్యంలో కార్మిక నాయకుడు దౌపాటి మల్లేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ“15 ఏళ్లుగా కార్మిక సంఘం నాయకునిగా మల్లేష్ ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తూ, కార్మికుల సంక్షేమానికి నిక్కసు నిజాయితీతో కృషి చేస్తున్నారు” అని ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్లు మైలపాక అంజి, అందే మల్లేష్, ముత్తయ్య, చిరంజీవి, చెవిటి వెంకన్న, కొంగర శోభన్ బాబు, బందెల రవి, గాలి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

## అందజేసిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి



**కనగల్లు ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కనగల్ మండల పరిధిలోని లింగాల గూడెం గ్రామ పంచాయితీ కి చెందిన మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు మర్రి  నరసింహ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించిన నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం మృతుని కుటుంబానికి 30 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తూ బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఏ సహాయం కావాలన్న తనను కలవాలని తెలిపారు . ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ఎస్ నాయకులు వంగాల సహదేవ రెడ్డి ,దేప వెంకటరెడ్డి ,మండల పార్టీ అధ్యక్షుడు ఐతగాని యాదయ్య ,నారబోయిన బిక్షం ,కడారి కృష్ణయ్య యాదవ్, ఎర్ర మాధ వెంకటరెడ్డి ,కదిరె శ్రీశైలం, ఎంపల సైదులు ,నకరెకంటి నాగరాజు ,బొబ్బలి మహేష్ తదితరులు  పాల్గొన్నారు.

# ఆర్థిక భారంతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

**మాడుగుల, ఆగస్టు12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆర్థిక ఇబ్బందులతో మాడుగుల మండలంలోని దొడ్లపాడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జంగయ్య (40) పురుగుల మందు సేవించి మృతి చెందాడు. ఆగస్టు 11 రాత్రి పురుగుల మందు తాగానని ఫోన్ చేసిన అతన్ని పొలంలో స్పృహలేని స్థితిలో కుటుంబ సభ్యులు గుర్తించారు. హాస్పిటల్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. జంగయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# “లీడర్ అంటే కేవలం రాజకీయమే కాదు, అభివృద్ధి కూడా”




**మునుగోడు, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
“నాయకత్వం అంటే కేవలం పదవులు కాదు, ప్రజల అభివృద్ధికి కృషి చేయడం కూడా అవసరం” అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మునుగోడు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ“ప్రభుత్వ alone చేస్తే సరిపోదు, నాయకులంతా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి. నా మాతృమూర్తి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా నిధులు కేటాయిస్తూ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పిస్తున్నాను” అని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో సమస్యలపై వ్యక్తిగత ఇంజనీరింగ్ విభాగం ద్వారా నివేదికలు సేకరించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. “ఎన్నారైల సహకారంతో నిధులు సమీకరించి అభివృద్ధిని వేగవంతం చేయాలి” అని సూచించారు.

# తిప్పర్తి మోడల్ స్కూల్, కేజీబీవీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఎస్వో ఛాయాదేవి



**తిప్పర్తి, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తిప్పర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కేజీబీవీ గర్ల్స్ హాస్టల్‌ను ఎంఎస్వో ఛాయాదేవి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, డార్మెటరీస్, కిచెన్, స్టోర్ రూమ్, వాష్ ఏరియా తదితర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా, పరిశుభ్రత పాటిస్తున్నారా అనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. “ప్రతి విద్యార్థి బాగా చదివి, తల్లిదండ్రుల, పాఠశాల పేరు నిలబెట్టాలి” అని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్, మండల విద్యాధికారి నరసింహ నాయక్, ఎంపీఓ జానయ్య తదితరులు  పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి దేశానికి గొప్ప ఆదర్శ నేత: సిపిఎం



**తిప్పర్తి ,ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సిపిఎం పార్టీ ఆల్ ఇండియా కార్యదర్శిగా భారతదేశ ప్రజలకు ఎంతో సేవ చేసిన సీతారాం ఏచూరి  73వ పుట్టినరోజు సందర్భంగా తిప్పర్తి మండల కమిటీ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగాలిసిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నన్నూరి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ సీతారాం ఏచూరి గారు తెలుగు రాష్ట్రాల్లో పుట్టి యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ సాధించి ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా కార్యదర్శిగా విద్యార్థి ఉద్యమంలో ఎంతగానో చురుకుగా పనిచేసి అంచలంచలుగా ఎదుగుతూ సిపిఎం పార్టీ ఆల్ ఇండియా కార్యదర్శిగా పనిచేస్తూనే వారు మరణించారు భారతదేశంలో ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలలో సిపిఎం పార్టీని బలోపేద చేయడం కోసం ఎంతగానో కృషి చేశారు పెట్టుబడిదారు విధానాన్ని వ్యతిరేకిస్తూ శ్రామిక ప్రజానీకాన్ని ఏకం చేయడం కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తిని అనేక దేశాలలో కమ్యూనిస్టు ప్రభుత్వాలతో నిత్యం సోషలిస్టు వ్యవస్థను స్థాపించడం కోసం కృషి చేసినటువంటి వ్యక్తి అని వారన్నారు వారి పుట్టినరోజు సందర్భంగా వారిని గుర్తు చేస్తూ సిపిఎం తిప్పర్తి మండల కమిటీ వారి ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తుందని వారన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం తిప్పర్తి మండల కార్యదర్శి మన్యం భిక్షం ,మండల కమిటీ సభ్యులు గండమల్ల రాములు, దొంగరి వెంకన్న ,జంజరాల సైదులు ,మంత్రాల మంగమ్మ ,జంజరాల ఉమా, పోకల శశిధర్, మాలే భార్గవి, పార్టీ సభ్యులు ఝాన్సీ ,శంకర్, సైదులు తదితరులు  పాల్గొన్నారు.

# ఘనంగా సీతారాం ఏచూరి జయంతి వేడుకలు



**కల్వకుర్తి, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సీపీఎం పార్టీ అఖిల భారత మాజీ కార్యదర్శి, అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి 73వ జయంతిని కల్వకుర్తిలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం సీనియర్ నాయకుడు ఏపీ మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి. ఆంజనేయులు మాట్లాడుతూ“ఆర్థిక దోపిడి, సామాజిక అణచివేత, కుల వివక్షత వంటి రుగ్మతలపై పోరాటానికి మార్క్సిజమే మార్గం అని నమ్మిన సిద్ధాంతవాది సీతారాం ఏచూరి. ఆయన ఎస్ఎఫ్ఐ, రాజ్యసభ, సీపీఎం జాతీయ స్థాయిలో కీలక పాత్ర పోషించారు” అని పేర్కొన్నారు. “ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి” అని కార్యకర్తలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జగన్, చంద్రయ్య, జంగయ్య, మహేష్, శ్రీనివాసులు, ప్రకాష్, మల్లేష్ తదితరులు  పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

## బోనమెత్తిన ఉప్పల కుటుంబ సభ్యులు





**ఎల్బీనగర్,ఆగస్టు12 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ జీవన విధానం, సంస్కృతి సాంప్రదాయాలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. హయత్ నగర్ లోని సాయి శ్రీనివాస బాటిల్స్ కంపెనీలో రేణుక ఎల్లమ్మ తల్లి కి కుటుంబ సభ్యులతో కలిసి బోనాన్ని తయారుచేసి  డప్పు వాయిద్యాలతో అమ్మవారి ఆలయానికి చేరి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆ తర్వాత అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి,అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త కుటుంబ సభ్యులు . ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బోనాలు ఆత్మ గౌరవానికి, ఐక్యతకు, సమష్టికి, ఘనమైన చరిత్రకు నిదర్శనమన్నారు.ఆ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రజలందరి పైనా అమ్మవారి దీవెనలు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నానన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి కి అన్ని విధాలా కృషి చేస్తుంది అని ఆయన అన్నారు.పాడి పంటలు సమృద్ధిగా పండాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల కుటుంబ సభ్యులు ఉప్పల స్వప్న , సాయి కిరణ్ కోడలు శార్వారీ , ఉప్పల సాయి తేజ , బంధువులు , కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప ఎన్నికలో కాంగ్రెస్ దే విజయం..

## -ఏఐసీసీ ఇంచార్జ్ విశ్వనాథ్, ఎమ్మెల్సీ అమీర్ అలీ...



**షేక్ పేట్, ఆగస్ట్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అతి త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లోకాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని ఏఐసీసీ ఇంచార్జ్ విశ్వనాథ్ అన్నారు. షేక్పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ బూత్ ఇన్చార్జిల సమావేశంలో ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఇన్చార్జ్ విశ్వనాథ్,  ఎమ్మెల్సీ అమీర్ అలీ కలిసి తో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్ ల పరిధిలోని ప్రతి ఒక్కరితో మాట్లాడి అతి త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమిష్టిగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ విజయదుందిభి మోగించడం తథ్యమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అమలవుతున్న పథకాల గురించి ఈ సందర్భంగా ఓటర్లకు విశ్వనాథ్ వివరించారు. ఈ కార్యక్రమంలో షేక్పేట్ డివిజన్ ప్రెసిడెంట్ డి.సత్యనారాయణ, నిజాముద్దీన్, అప్రోచ్, అశోక్, జ్యోతి, సోనీ, స్వరూప, శేఖర్, రఘు, రమేష్, బాలు, లడ్డు, జీవన్ తదితరులు  పాల్గొన్నారు.

# క్రీడా బిల్లులకు మద్దతు

## ఎంపీ వద్దిరాజు రాజ్యసభలో




**న్యూఢిల్లీ, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
క్రీడాకారుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన “జాతీయ క్రీడా పాలన బిల్లు–2025”కు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. ‘తెలంగాణలో కేసీఆర్ ప్రోత్సాహంతో గోపీచంద్, సానియా, నిఖత్, సిరాజ్, మేఘన, శ్రీజ అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. రాష్ట్రంలో 33 జిల్లాల్లో స్టేడియంలు నిర్మించారు. కానీ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేవలం 17 కోట్లు కేటాయించడం దురదృష్టకరం” అని విమర్శించారు. బిల్లులో క్రీడా సమాఖ్యలకు గుర్తింపు, పర్యవేక్షణ, ట్రైబ్యునల్ ఏర్పాటు, సేఫ్ స్పోర్ట్స్ పాలసీ, 3 శాతం ఉద్యోగ రిజర్వేషన్, నగదు బహుమతులు, పోషకాహారం, డోపింగ్ ల్యాబ్ వంటి అంశాలు అభినందనీయమని పేర్కొన్నారు. ‘క్రీడలు ఆరోగ్యకరమైన దేశ నిర్మాణానికి దోహదపడతాయి. ప్రతి పాఠశాలకు ఆటస్థలం ఉండాలి. యువతకు అవసరమైన వనరులు, అవకాశాలు కల్పించాలి” అని ఎంపీ సూచించారు.

# ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడం నేరమా..?







వరద నీటితో ముంచెత్తిన పెద్దపులి నాగారం ప్రాథమిక పాఠశాల



**మహేశ్వరం, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం పెద్దపులి నాగారం గ్రామ ప్రాథమిక పాఠశాల ఇప్పుడు ఒక చెరువును తలపిస్తోంది. ఆదివారం అర్ధరాత్రి 10 గంటల నుండి కురిసిన భారీ వర్షంతో సోమవారం ఉదయం వరకూ నీరు క్రమంగా పెరిగి పాఠశాలను చుట్టుముట్టింది. తరగతి గదులలోనే నిలువ నీరు చేరి విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు.ఇదే సమయంలో కరెంట్ తీగలు ఊడి నీటిలో పడిపోవడంతో ప్రమాదం తలెత్తే అవకాశం ఉందని గ్రహించిన పాఠశాల యాజమాన్యం, అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపివేయించి తీగలను పైకి కట్టించారు. పిల్లలకు ఏదైనా అనర్థం జరుగకముందే వారిని వెంటనే ఇంటికి పంపివేశారు. మంగళవారం కూడా నీటి ముప్పు కొనసాగుతుండటంతో తరగతులు నిలిపివేయక తప్పలేదు. "వాటర్‌లో నుంచే బాత్రూమ్‌కి వెళ్లాల్సి వస్తోంది. తరగతి గదుల్లో కూర్చున్నా దుస్తులు తడుస్తున్నాయి. ఇలాగే ఉంటే పాఠశాల ఎలా నడుస్తుంది?" అని యాజమాన్యం ఆవేదన వ్యక్తం చేసింది. గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఒకే స్వరంతో డిమాండ్ చేస్తున్నారు "రెండు రోజులుగా ఈ దృశ్యం చూస్తున్నాం. పాఠశాల చుట్టూ, లోపల నిలిచిన నీరు విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారేలోపే ఉన్నతాధికారులు కదలాలి. రాజకీయ నాయకులు కూడా మైక్ మీద మాటలు కాక, మైదానంలో చర్యలు చూపాలి." అధికారుల నిర్లక్ష్యం, నాయకుల విస్మరణతో ఈ చిన్నారుల విద్య కష్టకాలంలో పడింది. ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడం నేరమా ? లేక పేద పిల్లల ప్రాణాలు చవకా?

# రోడ్డు ప్రమాదంలో రేషన్ షాప్ డీలర్ మారేశ్ కన్నా మృతి



**కందుకూర్, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహేశ్వరం నియోజకవర్గంలోని కోలన్ గూడ గ్రామానికి చెందిన రేషన్ షాప్ డీలర్ మారేశ్ కన్నా (40) సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. మృతుడికి నలుగురు కుమారులు విజయ్ కుమార్, వినోద్ కుమార్, విక్రమ్ కుమార్, చిట్టిబాబు ఉన్నారు. "ఇందిరమ్మ ఇల్లు వచ్చాకే మా పెళ్లిళ్లు జరుపుతామని నాన్న చెప్పారు. ఈ సమయంలో ఇలా జరిగిందంటే బాధ కలుగుతోంది" అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# క్రీడాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

-వనపర్తి జిల్లా కేంద్రంలో క్రికెట్, హాకీ, స్విమ్మింగ్ పూల్, క్రీడా పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన



**వనపర్తి,ఆగస్టు 12( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన వనపర్తి జిల్లా, త్వరలోనే క్రీడలకు పుట్టినిల్లుగా మారనుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాల ప్రకటించారు. మంగళవారం వారు జిల్లా కేంద్రంలో పలు క్రీడా వసతుల నిర్మాణానికి సంబంధించి స్థలాలను పరిశీలించారు.

మెడికల్ కళాశాల పక్కన 8.5 ఎకరాల్లో క్రికెట్ మైదానం నిర్మాణం బాలుర జూనియర్ కళాశాల మైదానంలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుజేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల పక్కన హాకీ టర్ఫ్ మైదానం నిర్మాణం శ్రీనివాసపురం శివారులో 35 ఎకరాల్లో క్రీడా పాఠశాల ఏర్పాటు వీటికి సంబంధించిన పరిపాలన అనుమతులు త్వరలోనే జారీ అవుతాయని, పూర్తిస్థాయి ప్రణాళిక వివరాలను తక్షణమే సమర్పించాలంటూ అధికారులు ఆదేశాలు అందించారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే మేఘారెడ్డి వనపర్తిని క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తామని అన్నారు కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పట్టణ మాజీ కౌన్సిలర్లు, మండల నాయకులు, క్రీడాశాఖ అధికారులు, ఆర్డీఓ, తాసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా-చైనా మధ్య ట్రేడ్ డీల్‌కు మరో 90 రోజులు విరామం

**న్యూఢిల్లీ ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రష్యా చమురు కొనుగోలును కారణంగా చూపి భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీస్థాయిలో ప్రతీకార సుంకాలు విధించిన విషయం తెలిసిందే. న్యూఢిల్లీపై ఏకంగా 50 శాతం సుంకాలు విధించారు.ప్రస్తుతం 25 శాతం టారిఫ్ అమల్లోకి వచ్చింది. ఆగస్టు 27 నుంచి మిగతా 25 శాతం టారిఫ్ అమలులోకి రానుంది. అయితే, రష్యా చమురు కొనుగోలు చేస్తున్న చైనా విషయంలో మాత్రం ట్రంప్ భిన్నవైఖరితో ముందుకెళ్తున్నారు. డ్రాగన్‌పై ఎలాంటి టారిఫ్‌లు బాదడం లేదు. తొలుత చైనాపై భారీగా టారిఫ్‌ల బాంబ్ పేల్చిన ట్రంప్.. ఆ తర్వాత వెనక్కి తగ్గారు. ఇప్పుడు చైనాతో వాణిజ్య ఒప్పందానికి మరో 90 రోజుల విరామం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. వాణిజ్య ఒప్పందం చర్చల గడువును పొడిగించినట్లు చైనా కూడా తన అధికారిక మీడియాలో పేర్కొంది. రెండు దేశాలూ ఇటీవలే పోటాపోటీగా సుంకాలు



విధించుకున్న విషయం తెలిసిందే. చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై 145 శాతం టారిఫ్‌లు విధించనున్నట్లు ట్రంప్ ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించారు. ఇక చైనా సైతం అమెరికాపై 125 శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. అయితే, ఈ ఏడాది మేలో అమెరికా, చైనా మధ్య కీలక ట్రేడ్ డీల్ కుదిరింది. ఇరుదేశాలు సుంకాలను భారీగా తగ్గించేందుకు ఓ అంగీకారానికి వచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం.. అమెరికా దిగుమతులపై చైనా సుంకాలను 125 నుంచి 10 శాతానికి తగ్గించింది. మరోవైపు చైనా దిగుమతులపై అమెరికా సుంకాలను 145 నుంచి 30 శాతానికి తగ్గించింది. ఈ తగ్గింపు 90 రోజులు మాత్రమే అమల్లో ఉండేలా ఇరు దేశాలూ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆ ఒప్పందం మంగళవారం అర్ధరాత్రితో ముగియనుంది. దీంతో ట్రంప్ తాజాగా డ్రాగన్‌తో వాణిజ్య ఒప్పందానికి మరో 90 రోజుల విరామం ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనాపై ప్రతీకార సుంకాలు విధించాలా? వద్దా? అనే అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్? పేర్కొన్నారు. ఎందుకంటే, రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంతో సంబంధం లేని, అనేక అంశాలు అమెరికా-చైనా సంబంధాలను ప్రభావితం చేస్తాయని ఆయన అన్నారు.

# శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఉత్సవంలో పాల్గొన్న సబితా, మల్లారెడ్డి





**మహేశ్వరం, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని రావిర్యాల గ్రామంలో స్వయంభు శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవత బోనాల ఉత్సవం మరియు కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాకేష్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అశేష భక్తజనం తాళమేళాలు, డప్పుల వాయిద్యాలు, పోతరాజుల వీరంగం, శివసత్తుల ఆటపాటలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఉత్సవాలు శాంతియుతంగా ముగిసేలా అందరూ సహకరించాలని సబితా ఇంద్రారెడ్డి కోరారు. మున్సిపల్ సిబ్బంది, పోలీస్ శాఖ అందించిన సహకారానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డి గళ్ళ రత్నం, అధ్యక్షుడు జిల్లా లక్ష్మయ్య, మాజీ కౌన్సిలర్ సుమన్, రవి నాయక్, సప్పిడి రాజు, వెంకట్ రాజిరెడ్డి, సామ్యూల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏనుగుల జనాభా అత్యధికంగా ఉన్న రాష్ట్రంగా కర్ణాటక..

## ఎన్ని ఏనుగులంటే..!

**న్యూఢిల్లీ ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశంలోనే ఏనుగుల జనాభా అత్యధికంగా కలిగిన రాష్ట్రంగా కర్ణాటక తన స్థానాన్ని నిలబెట్టుకుంది. ఆ రాష్ట్రంలో అత్యధిక అటవీ ప్రాంతం కలిగిన చామరాజనగర్ జిల్లా ఏనుగుల సంరక్షణలో అగ్రస్థానంలో ఉంది. ఆగస్టు 12న ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా అటవీ అధికారులు ఏనుగుల జనాభాకు సంబంధించి కొత్త అంచనాలను వెల్లడించారు. భూమిపై నివసించే అతిపెద్ద క్షీరదమైన ఏనుగుల సంరక్షణలో చామరాజనగర్ జిల్లా పాత్రను అటవీ అధికారుల తాజా అంచనాలు పతాకస్థాయిలో నిలబెట్టాయి.రాష్ట్రంలో అతిపెద్ద అటవీ విస్తీర్ణం కలిగిన చామరాజనగర్ జిల్లాలో బందీపూర్, బిలిగిరి రంగనాథస్వామి ఆలయం అనే రెండు పులుల అభయారణ్యాలు ఉన్నాయి. అదేవిధంగా మలై మహాదేశ్వర్ వన్యప్రాణుల అభయారణ్యం, కావేరి వన్యప్రాణుల అభయారణ్యం అనే రెండు ప్రధాన వన్యప్రాణుల



అభయారణ్యాలు ఉన్నాయి. జిల్లాలో ఉన్న అటవీ ప్రాంతం ఆ జిల్లాను పులులు, ఏనుగులకు సహజ స్వర్గధామంగా మార్చింది. 2023 ఏనుగుల జనాభా లెక్కల ప్రకారం.. కర్ణాటకలో మొత్తం 6,395 ఏనుగులు ఉన్నాయి. వాటిలో కేవలం చామరాజనగర్ జిల్లాలోనే 2,500 కంటే ఎక్కువ ఏనుగులు ఉన్నట్లు తేలింది. అందులో బందీపూర్ టైగర్ రిజర్వ్‌లో 1,116 ఏనుగులు, బీఆర్‌టీ టైగర్ రిజర్వ్‌లో 619 ఏనుగులుండగా.. మలై మహదేశ్వర వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంలో 706, కావేరి వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంలో 236 ఏనుగులు ఉన్నాయి. గడిచిన రెండేళ్లలో కర్ణాటకలో ఏనుగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అటవీ శాఖ వర్గాలు చెబుతున్నాయి. తాజా అంచనాల ప్రకారం.. బందీపూర్ ఏనుగుల జనాభా 1,500 కంటే ఎక్కువగా ఉంది. అయితే మహదేశ్వర, కావేరి, బీఆర్‌టీ కలిపి 1,800 ఏనుగులు ఉన్నట్లు విశ్వసిస్తున్నారు. 2025 ఏడాదికి సంబంధించిన ఏనుగుల జనాభా లెక్కల నివేదిక ఇంకా వెల్లడి కానప్పటికీ.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిశీలనలు రాష్ట్రవ్యాప్తంగా ఏనుగుల సంఖ్యలో ఆరోగ్యకరమైన పెరుగుదల ధోరణిని సూచిస్తున్నాయి. నిరంతర పరిరక్షణ ప్రయత్నాలు, స్థానిక సమాజాలతో బలమైన భాగస్వామ్యం కారణంగా ఏనుగుల జనాభా పెరిగిందని అధికారులు చెబుతున్నారు. మానవ-ఏనుగుల సంఘర్షణను తగ్గించడానికి చర్యలు.. అంటే సౌరశక్తితో పనిచేసే కంచెల ఏర్పాటు, ఏనుగులను జనావాసాల్లోకి రాకుండా కందకాల ఏర్పాటు, రైల్వే బారికేడ్ల నిర్మాణం లాంటివి ఏనుగులను, జనావాసాలను రక్షించడంలో కీలకపాత్ర పోషించాయని అంటున్నారు. ఈ చర్యలు ఏనుగులు జనావాసాల్లోకి చొరబడటాన్ని తగ్గించాయని, మందలు అటవీ కారిడార్లలో స్వేచ్ఛగా సంచరించడానికి వీలు కల్పించాయని అధికారులు చెబుతున్నారు.